# భారత శక్తి ®


Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 231 | హైదరాబాద్ | శుక్రవారం 06-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

భారత్‌కు ఎలాంటి సమయంలోనైనా చమురు సరఫరా చేయడానికి మేం సిద్ధం: రష్యా ప్రకటన



11లో

## గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ

- గోదావరి పుష్కరాల నిర్వహణపై 9 మందితో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు
- కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు.. కన్వీనర్‌గా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి
- 2027 జూలై 23 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలు
- ప్రధాన ఆలయాలు, ఘాట్ల వద్ద శాశ్వత ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు, ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

### ఒక్క ఇల్లు కూల్చకుండా.. రూ. 16 వేల కోట్లతోనే
## మూసీ సుందరీకరణ చేసి

- ఒక్క ఇల్లు చెదరగొట్టకుండా రూ. 6 కోట్లతో సుందరీకరణ చేశాం
- రూ. 16 వేల కోట్లతో పోయేదానికి రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకు..?
- లూటిఫికేషన్ చేస్తామంటే తప్పకుండా అడ్డుకుంటాం..
- సీఎం రేవంత్‌ను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే..



11లో



11లో

## తెలంగాణలో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ తో పాటు ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలు

- హెల్త్ మిషన్100 పేరుతో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తెలంగాణ ప్రభుత్వం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్యక్రమం ప్రారంభం
- ఆరు నెలల పాటు కొనసాగనున్న వైద్య పరీక్షలు

### యుద్ధంతో సమస్యలు
## పరిష్కారం కావు: ప్రధాని మోదీ

- ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు
- చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం అని ఉద్ఘాటన
- ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన
- వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం
- విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం

11లో





### ఇరాన్ నౌక నుంచి ఆపద సంకేతం అందగానే
## వెంటనే స్పందించాం

11లో

- నిన్న అమెరికా దాడికి గురైన ఇరాన్ నౌక
- శ్రీలంక తీరానికి సమీపంలో మునక
- 'సెర్చ్ అండ్ రెస్క్యూ' ఆపరేషన్లు చేపట్టామన్న భారత నేవీ



### ఏపీలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు
## శుభవార్త

- పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే వారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు
- మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు అందుబాటులో ఉండనున్న సేవలు
- పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే అనుమతి
- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు

11లో

## తెలంగాణలో భానుడి భగభగ..

ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

11లో



### వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే..
## పూర్తి చేసి నీళ్లిచ్చేది నేనే

- వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నేటితో 30 ఏళ్లు పూర్తి
- నాడు ప్రకాశం ప్రజల కష్టాలు చూడలేకే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టానన్న సీఎం
- ఈ ఏడాది జులై నాటికి తొలి దశ పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు అందిస్తాం
- 2027-28 నాటికి వెలిగొండ ఫేజ్2 పనులు కూడా పూర్తి చేస్తామని వెల్లడి
- గత ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం చేసిందని విమర్శ





11లో

# సోషల్ మీడియాలో 'అడల్ట్' సెగ..

ప్రస్తుతం సోషల్ మీడియా ప్రపంచాన్ని ఒక కొత్త వైరస్ వణికిస్తోంది. అదే 'అడల్ట్ కంటెంట్'. ఒకప్పుడు సెన్సార్‌షిప్ ఉన్న సినిమాలకో లేదా ప్రత్యేక వెబ్‌సైట్లకో పరిమితమైన ఈ అశ్లీల కంటెంట్.. ఇప్పుడు మన అరచేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్ ద్వారా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ ఫీడ్‌లలో యథేచ్ఛగా దర్శనమిస్తోంది. సాధారణంగా సోషల్ మీడియా సంస్థలు అడల్ట్ కంటెంట్‌ను గుర్తించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అల్గారిథమ్‌లను వాడుతుంటాయి. అయితే.. కేటుగాళ్లు అంతకుమించి ఆలోచిస్తున్నారు. ఏఐ అల్గారిథమ్‌లను మోసం చేసేందుకు వీడియోలపై రకరకాల ఫిల్టర్లు వాడటం, అసభ్య పదజాలాన్ని డైరెక్ట్ గా వాడకుండా కోడ్ లాంగ్వేజ్‌ను ఉపయోగించడం చేస్తున్నారు. ఫలితంగా ఈ వీడియోలు ఫిల్టర్లకు చిక్కకుండా నెటిజన్ల ఫీడ్‌లోకి వచ్చేస్తున్నాయి. ఇది నేటి యువత ఆలోచనా ధోరణిని చెడు మార్గం వైపు మళ్లిస్తోందని సామాజిక విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో హీరోయిన్ల డీప్‌ఫేక్ వీడియోలు, ఇతర అసభ్యకర పోస్టుల విషయంలో 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వ్యవహరించిన తీరుపై భారత ప్రభుత్వం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐటీ నిబంధనల ప్రకారం కంటెంట్ నియంత్రణ చేయకపోతే.. ఆ సంస్థకు ఉన్న 'సేఫ్ హార్బర్' రక్షణను తొలగిస్తామని, అవసరమైతే దేశంలో కార్యకలాపాలు నిలిపివేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. దీనిపై స్పందించిన ఎక్స్ యాజమాన్యం, ఈ ఏడాది జనవరిలో భారీ ప్రక్షాళన చేపట్టింది. అధికారిక లెక్కల ప్రకారం.. నిబంధనలు ఉల్లంఘించిన 600కు పైగా ఖాతాలను శాశ్వతంగా బ్లాక్ చేయడంతో పాటు, సుమారు 3500కు పైగా అడల్ట్ పోస్టులను తొలగించింది. ఎక్స్ ప్లాట్‌ఫారమ్ ఇటీవల తన పాలసీలో కీలక మార్పులు చేసింది. 'కన్సెన్సువల్ అడల్ట్ కంటెంట్' (పరస్పర అంగీకారంతో కూడిన అశ్లీల కంటెంట్) ను అధికారికంగా అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. అడల్ట్ కంటెంట్ క్రియేటర్ల ద్వారా ప్లాట్‌ఫారమ్‌కు భారీగా యూజర్ ట్రాఫిక్ రావడంతో పాటు సబ్‌స్క్రిప్షన్ ఆదాయం లభిస్తోంది. అందుకే దీనిని పూర్తిగా నిషేధించడానికి ఎక్స్ సిద్ధంగా లేదనడంలో సందేహం లేదు. అయితే.. 18 ఏళ్ల లోపు యువతకు, తమ ప్రొఫైల్‌లో పుట్టిన తేదీ పేర్కొనని వారికి ఈ కంటెంట్ కనిపించకుండా 'ఏజ్ గేటింగ్' అనే సాంకేతికతను అమలు చేస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మెటా ప్లాట్‌ఫారమ్‌లు నిబంధనల విషయంలో ఎక్స్ కంటే కఠినంగా ఉన్నాయని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఒక అసభ్యకర అకౌంట్‌ను బ్లాక్ చేస్తే, అదే పేరుతో లేదా వేరే ఐడీతో మరో పది అకౌంట్లు పుట్టుకొస్తున్నాయి. ఇది ఒక సవాలుగా మారింది. టెక్నాలజీ మారుతున్న కొద్దీ అశ్లీలత కొత్త రూపాలు సంతరించుకుంటోంది. కేవలం కంపెనీల సెన్సార్‌షిప్‌పైనే ఆధారపడకుండా, వినియోగదారులు కూడా అవగాహనతో ఉండాలి. అసభ్యకర కంటెంట్‌ను చూసిన వెంటనే రిపోర్ట్ చేయడం, సెట్టింగ్స్‌లో సెన్సిటివ్ కంటెంట్ కంట్రోల్ ఉపయోగించడం ద్వారా కొంతవరకు ఈ ముప్పును అరికట్టవచ్చు. ప్రభుత్వం కూడా ఐటీ చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. సోషల్ మీడియా యాజమాన్యాలు అశ్లీల కంటెంట్‌ను అరికట్టడానికి కేవలం నిబంధనలు విధించడమే కాకుండా, టెక్నాలజీ, హ్యూమన్ వర్కర్ల సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలి. మల్టీ-లేయర్డ్ ఎఐ అల్గారిథమ్స్ ద్వారా అప్‌లోడ్ అయ్యే ప్రతి వీడియోను స్కాన్ చేసి, అసభ్యకరంగా ఉంటే ఆటోమేటిక్‌గా రిజెక్ట్ చేయాలి. ముఖ్యంగా ఏఐని మోసం చేసేలా వాడే ఫిల్టర్లు, కోడ్ లాంగ్వేజ్‌లను గుర్తించేలా అల్గారిథమ్‌లను నిరంతరం అప్‌డేట్ చేయాలి. కేంద్రీకృత ఏజ్ వెరిఫికేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టి, కేవలం ఆధార్ లేదా అధికారిక గుర్తింపు కార్డుల ద్వారా వయస్సు నిర్ధారణ అయిన వారికే సున్నితమైన కంటెంట్ కనిపించేలా చూడాలి. డీప్‌ఫేక్ కంటెంట్‌ను గుర్తించే వాటర్ మార్కింగ్ టెక్నాలజీని వాడాలి. పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిని డివైస్ లెవల్ బ్యాన్ చేయడం ద్వారా కొత్త అకౌంట్లు తెరవకుండా అడ్డుకోవచ్చు. అలాగే.. యూజర్ల నుండి వచ్చే రిపోర్ట్‌లపై స్పందించడానికి హ్యూమన్ మోడరేషన్ టీమ్‌ను పెంచాలి. ఆదాయం కంటే సామాజిక బాధ్యతకే ప్రాధాన్యతనిస్తూ, అశ్లీల కంటెంట్ ద్వారా వచ్చే అడ్వర్టైజ్‌మెంట్ ఆదాయాన్ని నియంత్రించినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

# ఆల్ ఈజ్ వెల్ కోసం తాపత్రయం

గుంటూరు, మార్చి 5

ఒకటే ఎజెండా. ఒకటే లైన్. నో క్లాషెన్. కమ్యూనికేషన్ గ్యాప్స్‌కు ఛాన్సే లేదు. డెసిషన్ ఏదైనా..మ్యాటర్ మరేదైనా కలిసే నిర్ణయం తీసుకుంటాం. కలిసిగట్టుగానే ముందుకెళ్తామంటున్నారు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. కూటమి భాగస్వామ్య పార్టీల రథసారథులుగా కీలకంగా ఉన్న ఇద్దరు టాప్ లీడర్లు..వరుస పెట్టి..నెలలో ఒకటి రెండుసార్లు భేటీ అవుతుండటం సమ్‌థింగ్ స్పెషల్‌గా మారింది. ఆ ఇద్దరు వన్ టు వన్ భేటీ అయ్యారు. కూటమిలో రెండు కీలక పార్టీల అధ్యక్షులు. పైగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశంపై ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇంట్రెస్టింగ్ చర్చ జరుగుతోంది. వరుస పెట్టి భేటీల వెనుక మ్యాటరేంటన్నది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఈ మధ్య రెగ్యులర్‌గా భేటీ అవుతూ పొలిటికల్ హాట్ టాపిక్ అవుతున్నారు. అటు అసెంబ్లీ సమావేశాల్లో కలుసుకుంటున్నారు. మంత్రివర్గ సమావేశాల్లోనే పక్కపక్కనే కూర్చుంటారు. అయినా ఆ ఇద్దరు ప్రత్యేకంగా భేటీ అవుతుండటం కూటమి నేతల్లో, జనాల్లో తెలియని క్యూరియాసిటీని పెంచేస్తోంది. బాబు, పవన్ ఇద్దరూ రోజంతా అసెంబ్లీలో కనిపిస్తున్నారు. అటు మంత్రివర్గ భేటీలో కూడా కలిసే ఉంటారు. నెక్స్ డే స్పెషల్‌గా వన్ టు వన్ భేటీ అవుతున్నారు. అలా వన్ టు వన్ భేటీ జరిగిందంటే ఏదో కీలక అంశాలపై డిస్కస్ చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. ఈ మధ్యలో జరిగిన రాజకీయ పరిణామాల మీదనే ఈ ఇద్దరు చర్చించి ఉంటారని అంటున్నారు. ఈ మధ్యే బాబు, పవన్ భేటీ జరిగింది. కల్తీ నెయ్యి ఇష్యూతో పాటు..పలు అంశాలపై డిస్కస్ చేశారు. ఆ తర్వాత కూటమి పార్టీల కంబైన్డ్ ప్రెస్‌మీట్ పెట్టి సంకేతాలు ఇవ్వగలిగారు. నెల రోజుల వ్యవధిలోనే మరోసారి బాబు, పవన్ సమావేశం జరిగింది. అది కూడా ఓవైపు అసెంబ్లీ సమావేశాలు నడుస్తుండగా బాబు, పవన్ సమావేశానికి ముందు ఏదో ఒక ఇష్యూ జరుగుతూనే ఉంది. ఆ టాపిక్ మీదే వారి భేటీలో డిస్కషన్ జరిగినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ మధ్య ఒంగోలు కూటమి రాజకీయం హాట్ టాపిక్‌గా మారింది. టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, జనసేన నేత, మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మధ్య కోల్డ్‌వార్ మరోసారి రచ్చకెక్కింది. సవాళ్లు, ప్రతి సవాళ్లతో తగ్గేదేలే అంటున్నారు ఆ ఇద్దరు లీడర్లు. సేమ్‌టైమ్ అక్కడక్కడ జనసేన, టీడీపీ యాక్టివిస్టుల మధ్య ఇన్‌సైడ్ వార్ కొనసాగుతోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ మధ్య మంచి అండర్ స్టాండింగ్ ఉన్నా..గ్రౌండ్ లెవెల్‌లో ఎక్కడో ఓ చోట క్లాషెస్ రచ్చకెక్కుతుండటం కూటమికి హెడెక్‌గా మారాయి. ఈ ఇంటర్నల్ వార్‌కు ఎప్పటికప్పుడు చెక్ పెట్టేందుకు ప్రయత్నించే క్రమంలోనే చంద్రబాబు, పవన్ భేటీలో కీలక డెసిషన్ తీసుకున్నట్లు చెప్పుకుంటున్నారు. కూటమిలో రెండు పార్టీల క్యాడర్ నుంచి మొదలెట్టి లీడర్ల దాకా అంతా కలసికట్టుగా ఉండాలని టీడీపీ, జనసేన చీఫ్‌లు ఎప్పటికప్పుడు కోరుతూనే ఉన్నారు. ఏ ఇబ్బందులు, సమస్యలు ఉన్నా కూర్చుని సర్దుబాటు చేసుకోవాలని చెబుతున్నారు. అలకలు, అసంతృప్తులు సహజం..వాటిని పెద్దవి చేయకుండా సాఫీగా పరిష్కారం చేసుకోవాలని కూడా సజెస్ట్ చేస్తున్నారు. అయినా కొంత గ్యాప్ అయితే అక్కడక్కడ కొనసాగుతోంది. వాటికి ఎలా చెక్ పెట్టాలనేది టాప్ ప్రయారిటీగా తీసుకోవాలని అనుకుంటున్నారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోవడం..కూటమి పార్టీల మధ్య క్లాషెస్ వైసీపీకి అడ్వాంటేజ్‌గా మారే ప్రమాదం ఉండటంతో వీలైనంత త్వరగా అంతా సెట్‌రైట్ చేయాలని భావిస్తున్నారట. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో జరిగిన భేటీ ఏకంగా రెండు గంటలకు పైగా సాగింది. పాలనాపరమైన అంశాల నుంచి రాజకీయ అంశాల దాకా చర్చకు వచ్చాయని చెబుతున్నారు. ఏపీలో విపక్ష వైసీపీ వ్యవహార శైలి, మండలిలో ఛైర్మన్ తీరు..రాజ్యసభ సీట్లపై కూడా చర్చ జరిగిందని అంటున్నారు. ఏపీలో ఇంకా కొన్ని కీలక నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. తొందరలోనే నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. వీటిపై కూడా డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. టీడీపీకి రెండు, బీజేపీ, జనసేనకు చెరో రాజ్యసభ సీటు అన్నది ఐదారు నెలలుగా ప్రచారం జరుగుతోంది. ఈ సీట్ల కోసం ఎంతో మంది ఆశావహులు ఉన్నారు. అయితే ఎవరిని నామినేట్ చేయాలన్నది చర్చించి ఉండే అవకాశం ఉంది. ఇక అసెంబ్లీ సెషన్ ఈ నెల 7వ తేదీతో ముగియనుంది. దాంతో ఈ సమావేశాలు ముగిసేలోపు చేపట్టాల్సిన వ్యూహంపై చర్చించారని అంటున్నారుఅయితే లేటెస్ట్‌గా వైసీపీ కాస్త దూకుడు పెంచినట్లు కనిపిస్తోంది. కల్తీ నెయ్యి ఇష్యూలో సిట్ రిపోర్ట్ తర్వాత చాలా మంది లీడర్లు లైమ్ లైట్‌లోకి రావడం..కూటమిపై డైరెక్ట్ అటాక్ చేస్తుండటంతో..మరింత పటిష్టమైన వ్యూహంతో ముందుకెళ్లే ఆలోచన చేస్తోందట కూటమి. ప్రతీ అంశాన్ని రాజకీయంగా పీక్స్‌కు తీసుకెళ్తున్న ఫ్యాన్ పార్టీని ధీటుగా ఎదుర్కోవాలన్నదే చంద్రబాబు, పవన్ డెసిషన్ అంటున్నారు. అయితే చంద్రబాబు, పవన్ ఇద్దరు కీలక శాఖలు చూస్తున్నారు. అవన్నీ నిధులు ఉంటేనే పనిచేయగలిగే శాఖలుఅలాంటి ఇంటర్నల్ అంశాలే కీలకమైనా..ప్రతీసారి ఈ ఇద్దరి భేటీతో అయితే ఇటు కూటమి పార్టీల క్యాడర్‌కు, అటు ప్రజలకు పాజిటివ్ ఇండికేషన్సే వెళున్నాయని చెబుతున్నారు. వారి భేటీ కంటే ముందు జరుగుతున్న రాజకీయ రచ్చ, ప్రజా సమస్యలపై సీఎం, డిప్యూటీ సీఎం భేటీలో ఓ కన్‌క్లూజన్‌కు వస్తున్నారని అంటున్నారు. సేమ్‌టైమ్ కూటమి బలంగా పటిష్టంగా ఉందని మిత్రుల మధ్య సయోధ్య ఉందన్న సందేశం వెళ్తుందని చర్చించుకుంటున్నారు.

# టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్లలో ఏపీ టాప్

విజయవాడ మార్చి 5,

అవయవాల దానంలో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ రాష్ట్రాల వారీగా అవయవ దానం జాబితా-2025ను ప్రకటించింది. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన జీవన్ దాన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తుందన్నారు. ఇటీవల హైకోర్టు ప్రభుత్వాసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సల గురించి ఆదేశాలు వెలువరించిన నేపథ్యంలో మంత్రి సత్య కుమార్ వైద్య ఆరోగ్య, జీవన్ దాన్ ట్రస్ట్ అధికారులతో సమీక్ష జరిపారు. అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగే ఆసుపత్రుల సంఖ్య మూడు నుంచి తొమ్మిదికి పెరిగిందన్నారు ఈ జాబితాలో వైజాగ్ కేజీహెచ్, విమ్స్, గుంటూరు జీజీహెచ్, కర్నూలు జీజీహెచ్, తిరుపతి స్విమ్స్, మంగళగిరి ఎయిమ్స్, పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్-తిరుపతి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పలాస, జీజీహెచ్ విజయవాడ ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. అలాగే కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు, అనంతపురం, వైయస్సార్ కడప, తిరుపతి ఆసుపత్రుల్లో బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాల తొలగింపు, ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు అవసరమైన అనుమతులు ఇచ్చామని జీవన ట్రస్ట్ కోఆర్డినేటర్ రాంబాబు.. మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు పెరిగేలా చూడాలని, పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు. విశాఖలోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వాసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి చేయగా రక్తసంబంధీకుల నుంచి 87 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసినట్లు అధికారులు వివరించారు. తాజాగా విజయవాడ శివారులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెను స్వీకరించి గుండె మార్పిడి విజయవంతంగా పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రెండు నెలల కాలంలో 18 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 64 అవయవాలు స్వీకరించి 64 మంది జీవితాల్లో వెలుగులు నింపారు. ఇది గడిచిన రెండు సంవత్సరాలతో పోల్చుకుంటే గణనీయంగా అవయవ దాన కేసులు పెరుగుతున్నాయి అనటానికి నిదర్శనం అన్నారు మంత్రి సత్యకుమార్. గత ఏడాది మొదటి రెండు నెలల్లో 12 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 31 అవయవ దాన మార్పిడి జరిగితే, 2024 లో 10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు నుంచి సహకరించిన 30 అవయవాల మార్పిడి జరిగాయన్నారు. 1200 మంది బాధితులకు రాష్ట్ర జీవన్ దాన్ నూతన జీవితాలను ప్రసాదించిందని బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపిందన్నారు మంత్రి. గత ఏడాది కాలంలోనే 301 మంది బాధితులకు నూతన జీవితాలను ప్రసాదించి సరికొత్త చరిత్రను రాష్ట్ర జీవన్ దాన్ సృష్టించింది అని పేర్కొన్నారు..రాష్ట్రంలో 20-50 ఏళ్ల వయసు మధ్యలో ఎక్కువ మంది అవయవాలు విఫలమై బాధపడుతున్నట్లు రాష్ట్ర జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా తెలిసిందన్నారు మంత్రి సత్యకుమార్. ట్రస్టులో ఇప్పటి వరకు 5347 మంది పలు అవయవాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో అధికంగా యువకులే ఉండటం ఉన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 0-09 ఏళ్లలోపు పిల్లలు 38 మంది ఉన్నారని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.(

బెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించే విధంగా వాళ్లకి గౌరవం కల్పించేడానికి జారీ చేసిన జీవో 95 ద్వారా అవయవ దానం చేసిన వ్యక్తికి ప్రభుత్వ లాంఛనాలతో దహన సంస్కరణలు జరుగుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. అలాగే అవయవదాత కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆర్థిక సాయం రూ.లక్ష వరకు పెంచే విషయనీ ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.

# వైసీపీలో కొత్త నియామాకాలు

కడప, మార్చి 5

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలపడేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. జగన్మోహన్ రెడ్డి సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. అన్ని సామాజిక వర్గాల నేతలు మొహరిస్తున్నారు. గత కొద్దిరోజులుగా కాపు సామాజిక వర్గం చుట్టూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు తిరుగుతున్నాయి. మరోవైపు ఎస్సీ సామాజిక వర్గం నేతలతో కూడా జగన్మోహన్ రెడ్డి గట్టిగానే మాట్లాడిస్తున్నారు. ఒకవైపు రాజకీయం చేస్తూనే మరోవైపు రాజకీయంగా బలపడాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా ప్రాంతాలవారీగా పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రతో పాటు గోదావరి జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా పార్టీలో సీనియర్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. తాజాగా రీజినల్ కోఆర్డినేటర్లను నియమించారు.

గతంలో ఉత్తరాంధ్రను ఒక రీజియన్ గా చూసి నియామకాలు చేపట్టేవారు. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలకు కలిపి ఒక ప్రాంతీయ సమన్వయకర్తను నియమించిన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి లాంటివారు వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి ఉత్తరాంధ్రను విడగొట్టారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం ఒక రీజియన్ గా చూపి కోఆర్డినేటర్ గా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడును నియమించారు. మరోవైపు విశాఖ, విజయనగరం రీజియన్ కోఆర్డినేటర్ గా మాజీమంత్రి



కురసాల కన్నబాబును, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ఒక రీజియన్ గా చేసి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను, ఉమ్మడి పశ్చిమగోదావరి రీజియన్కు మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ను సమన్వయకర్తగా నియమించారు జగన్మోహన్ రెడ్డి. తద్వారా కీలక నేతలందరికీ బాధ్యతలు అప్పగించినట్టు అవుతుంది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు రీజియన్లను విభజించి కోఆర్డినేటర్లను నియమించేవారు. ఈ నేపథ్యంలో రకరకాల సమస్యలు వచ్చేవి. ఈసారి అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ.. అందరి నేతలకు బాధ్యతలు అప్పగించాలన్న ఆలోచన లోకి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా కోఆర్డినేటర్లను నియమిస్తారని తెలుస్తోంది. త్వరలో జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. అంతకంటే ముందే రీజనల్ కోఆర్డినేటర్ల నియామకం పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన అదే పని మీద ఉన్నారు. మరోవైపు రాష్ట్ర కోఆర్డినేటర్ గా ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఆయన స్థానంలో సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు నియమిస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే మున్ముందు పార్టీ నియామకాల విషయంలో జగన్మోహన్ రెడ్డి కఠిన నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తారని ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# ప్రకాశంలో ఫ్యాన్ కు రెక్కలు కరువు

ఒంగోలు, మార్చి5 (

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒకప్పుడు వైసీపీ కి బలమైన కోటగా గుర్తింపు పొందింది. వరుస ఎన్నికల్లో పార్టీకి గట్టి మద్దతు ఇచ్చిన ఈ జిల్లా 2024 ఎన్నికలలో మాత్రం భిన్నమైన తీర్పు ఇచ్చింది. దీనికి ప్రతిపక్ష ప్రభావం కంటే, పార్టీ అంతర్గత సమస్యలే ప్రధాన కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ రాయలసీమ లో హార్డ్ కోర్ ప్రాంతంగా చెప్పుకునే ప్రకాశం జిల్లా ఇప్పుడు వైసీపీకి ఆత్మపరిశీలన అవసరాన్ని గుర్తు చేస్తోంది. 2014 ఎన్నికలలో టీడీపీ , బీజేపీ జనసేన కూటమి బలంగా ఉన్నప్పటికీ, వైసీపీ ఐదు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని తన స్థిరతను చాటుకుంది. 2019లో పరిస్థితి మరింత అనుకూలంగా మారి ఎనిమిది స్థానాలు దక్కించుకుంది. అయితే 2024లో పార్టీ కేవలం రెండు సీట్లకే పరిమితమైంది. అంతేకాకుండా ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూడా కోల్పోయింది. ఈ పరిణామం జిల్లా రాజకీయాల్లో పెద్ద మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. జిల్లాలో బలమైన నాయకత్వం తగ్గిపోవడం కూడా పార్టీకి ప్రతికూలంగా మారిందని అంటున్నారు. ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి టీడీపీలో చేరి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అలాగే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ( జనసేనలోకి మారడం పార్టీకి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఎన్నికల ముందు పలువురు నేతలు పార్టీని వీడడం వల్ల కేడర్‌లో గందరగోళం ఏర్పడింది. ప్రస్తుతం జిల్లాలో టీడీపీ?జనసేన కూటమి బలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పది అసెంబ్లీ స్థానాలు ,ఒక ఎంపీ సీటుతో కూటమి ఆధిపత్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి పునర్వ్యవస్థీకరణ అత్యవసరంగా మారింది. ఓటమి తర్వాత జిల్లా బాధ్యతలను దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కి అప్పగించినప్పటికీ, పార్టీని మళ్లీ ఉత్సాహపరిచే స్థాయిలో చైతన్యం రాలేదని కేడర్ అభిప్రాయపడుతోంది. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌అప్పుడప్పుడు మీడియా సమావేశాలు నిర్వహించినా, కేడర్‌తో ప్రత్యక్ష సంబంధం పెంచే చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. జిల్లాలో సీనియర్ నాయకుడిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కూడా చురుకుదనం చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పార్టీ కార్యకర్తలు నాయకత్వంపై స్పష్టమైన దిశానిర్దేశం కోరుతున్నారు. ఓటమి జరిగి ఇరవై నెలలు గడుస్తున్నప్పటికీ, జిల్లా స్థాయిలో నిరాశ వాతావరణం కొనసాగుతోందని చెబుతున్నారు. పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే సమన్వయం, చురుకైన నాయకత్వం , కేడర్‌కు ధైర్యం చెప్పే కార్యక్రమాలు అవసరమని భావిస్తున్నారు. అధినాయకత్వం ప్రకాశం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే భవిష్యత్తులో మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు సూచిస్తున్నాయి.

# రంగుల మిరపతో పాటు.. మహేంద్ర...

## వైరల్ గా మారిన లోకేష్ ట్వీట్

గుంటూరు మార్చి5,

గుంటూరు మిర్చి సాగు అద్భుత దృశ్యాలపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా , ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ మధ్య సోషల్ మీడియా వేదికగా జరిగిన ఆసక్తికర చర్చ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. గుంటూరు జిల్లాలో మిరపకాయలను ఆరబోసిన దృశ్యాలను డ్రోన్ ద్వారా చిత్రీకరించిన వీడియోను ఆనంద్ మహీంద్రా షేర్ చేశారు. పైనుంచి చూస్తుంటే ఎర్రటి తివాచీ పరిచినట్లున్న ఈ దృశ్యం ప్రకృతి సిద్ధమైన హోలీ రంగుల పండుగను తలపిస్తోందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని కేవలం వ్యవసాయానికే పరిమితం చేయకుండా, ఏపీ ప్రభుత్వం దీనిని ఒక పర్యాటక ఆకర్షణగా మార్చాలని ఆనంద్ మహీంద్రా సూచించారు. శీతాకాలంలో జరిగే ఈ పంట కోత సమయాన్ని పర్యాటక సీజన్‌గా మార్చవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. నేల మీద నుంచి చూస్తే ఈ అందం కనిపించకపోవచ్చని, అందుకే పర్యాటకుల కోసం హాట్ ఎయిర్ బెలూన్ రైడ్స్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని, అలాగే స్థానిక సంగీత, నృత్య ప్రదర్శనలతో ఒక ఫెస్టివల్‌లా దీనిని నిర్వహించవచ్చని అద్భుతమైన ఐడియాలను ఇచ్చారు.ఆనంద్ మహీంద్రా సూచనలపై మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందిస్తూ సానుకూలంగా సమాధానమిచ్చారు. గుంటూరు మిర్చి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, వేల మంది రైతుల కష్టానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ రంగుల దృశ్యాన్ని పర్యాటక పరంగా ఎలా అభివృద్ధి చేయవచ్చో పరిశీలించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు లోకేష్ విజ్ఞప్తి చేశారు. మహీంద్రా ఇచ్చిన సలహాలు స్థానిక రైతుల ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో మంత్రి లోకేష్ చమత్కారంగా మరో ప్రతిపాదన కూడా చేశారు. భవిష్యత్తులో ఏపీపై డ్రోన్ విజువల్స్ తీసినప్పుడు కేవలం వ్యవసాయ క్షేత్రాలే కాకుండా.. రాష్ట్రంలో రాబోయే మహీంద్రా ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్స్, ఏరోస్పేస్ పార్కులు కూడా ఆ డ్రోన్ కెమెరాల్లో కనిపించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పారిశ్రామికంగా కూడా ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి చెందుతోందో ప్రపంచానికి చూపించాలనే తన ఆకాంక్షను ఆయన వెల్లడించారు. ఆనంద్ మహీంద్రాను స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానిస్తూ లోకేష్ ట్వీట్ చేశారు. ఏపీలో ఉన్న పారిశ్రామిక మరియు పర్యాటక అవకాశాలను దగ్గరుండి చూపిస్తామని లోకేష్ పేర్కొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.నారా లోకేష్ ఈ వీడియో పోస్ట్ చేసిన తర్వాత దీనిపై దేశీయ కార్పొరేట్ దిగ్గజం ఆనంద్ మహీంద్రా స్పందించారు. వీడియో అద్భుతంగా ఉందని.. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉందని ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు. దీనిపై కందుల దుర్గేష్ తో మాట్లాడుతామని.. పర్యటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని నారా లోకేష్ పేర్కొన్నారు. అయితే ఇక్కడే నారా లోకేష్ తన లౌక్యాన్ని ప్రదర్శించారు. భవిష్యత్తు కాలంలో ఏపీలో మహీంద్రా ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ పార్కులను కూడా ఇలాంటి డ్రోన్ కెమెరాల ద్వారా రూపొందించిన వీడియోలో చూడాలని ఉందని లోకేష్ పేర్కొన్నారు. లోకేష్ అకస్మాత్తుగా తనలో ఉన్న ఈ మాటను బయట పెట్టడంతో ఆనంద్ మహీంద్రా కూడా సానుకూలంగా స్పందించారు.భవిష్యత్ కాలంలో ఏపీలో మహీంద్రా కంపెనీ ఆటో ఫ్యాక్టరీ, డిఫెన్స్ పార్కులను ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. వీటి ద్వారా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సమాచారం. మహేంద్ర కంపెనీ ఇప్పటికే విశాఖపట్నంలో ఐటీ కార్యకలాపాలు సాగిస్తోంది. సత్యం కంపెనీని టేకోవర్ చేసుకున్న తర్వాత మహీంద్రా ఐటీ కార్యకలాపాలను వేగవంతం చేసింది. హైదరాబాదులో టెక్ మహీంద్రా పేరుతో అతిపెద్ద ఐటీ కంపెనీని నిర్వహిస్తోంది. ఒక పారిశ్రామిక దిగ్గజం ఇచ్చిన ఐడియాకు, ఒక యువ మంత్రి స్పందించిన తీరు సోషల్ మీడియాలో నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

-----------------

# పెట్రో భారం తప్పదా...

న్యూఢిల్లీ, మార్చి 5,

అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేస్తోంటే.. ప్రతిగా ఇరాన్ సైతం అమెరికా స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై క్షిపణులతో దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిలో రవాణాకు ఆటంకాలు ఏర్పడం వల్ల భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలపైనా ప్రభావం చూపుతుంది. ఈ ప్రభావంతో చమురు ధర పెరుగుతుండటంతోపాటు ఇతర వస్తువుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది.అమెరికా వెస్ట్ టెక్సస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ధర 3.19 శాతం పెరిగి 67.29డాలర్లకు చేరింది. బ్రెంట్ క్రూడ్ 72.87 డాలర్లకు చేరుకుంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ధర బ్యారెల్ కు 100 డాలర్లను తాకుతుందని బార్ క్లేస్ బ్యాంక్ అంచనా వేసింది. ధర ఈ స్థాయికి చేరితే మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధర రూ. 10వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.భారతదేశ ముడి చమురు అవసరాల్లో 88శాతం దిగుమతులే తీరుస్తున్నాయి. మనదేశం రోజుకు 5.5. మిలియన్ బ్యారెళ్ల చమురును వాడుతుంది. ఇందులో రెండు మిలియన్ బ్యారెళ్లు హోర్ముజ్ జలసంధి మీదుగానే వస్తోంది. క్రూడ్ ధర ఒక్క డాలర్ పెరిగినా.. ఏటా ప్రభుత్వంపై రూ.13వేల కోట్ల భారం పడుతుంది. గత ఏడాది మన దేశం 160 బిలియన్ డాలర్ల విలువైన క్రూడ్ ను కొనుగోలు చేసింది.ఇంధన ధరల వల్ల ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు కరెంట్ అకౌంట్ లోటు ఎగిసే అవకాశం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత్ వద్ద 76 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్రం ప్రకటించింది. బ్రెంట్ చమురు బ్యారెల్ ధర 77డాలర్లకు చేరువైనా.. దేశీయంగా పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలు సమీప కాలంలో పెరగకపోవచ్చునని విశ్వసనీయ వర్గాలు




చెబుతున్నాయి. అయితే, ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే.. హోర్ముజ్ జలసంధిలో రవాణా బంద్ అయితే భారత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగే చాన్స్ ఉందని తెలుస్తోంది.డీజిల్ తో పాటు వంట నూనెలపైనా యుద్ధం ప్రభావం పడుతుంది. 16 మిలియన్ టన్నుల వంట నూనె దిగుమతుల్లో పొద్దుతిరుగుడు పువ్వు నూనెవాటా 20శాతం. రష్యా, యుక్రెయిన్, అర్జెంటీనా నుంచి ఈ దిగుమతులు ఎర్ర సముద్రం అవల నుంచి తీసుకురావాలంటే ఎక్కు వ్యయాలు అవుతాయి. యుద్ధం మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే ఎరువుల ధరలుసైతం పెరిగే అవకాశం ఉంది. జూన్ లో ఖరీఫ్ సీజను ప్రారంభం కావడానికి ముందు డీఏపీ, ఎస్ఎస్‌పీ ఎరువుల తయారీలో కీలకమైన సల్ఫర్, సల్ఫ్యూరిక్ యాసిడ్ సరఫరా పై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత సల్ఫర్ దిగుమతుల్లో ఖతార్, యూఏఈ, ఒమన్ కు 76శాతం వాటా ఉంది.

# జాతీయ రాజకీయాల్లోకి నితీష్

పాట్నా, మార్చి 5,

బీహార్ రాజకీయాల్లో పెను మార్పు వస్తుందని చర్చ జరుగుతోంది. నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగి రాజ్యసభలోకి ప్రవేశించవచ్చని వార్తలు వస్తున్నాయి. ఆయన కుమారుడు నిశాంత్ కుమార్ ఉప ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంలో, భారతీయ జనతా పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఒకరు బీహార్ ముఖ్యమంత్రి కావచ్చని తెలుస్తోంది.నిన్నటి వరకు నిశాంత్ కుమార్ రాజ్యసభలో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభిస్తారని వార్తలు వచ్చాయి. రాజ్యసభకు నిశాంత్ పేరు దాదాపుగా ఖరారు అయిందని కూడా చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు, జెడియు యాక్టింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా ఢిల్లీ నుండి పాట్నాకు బయలుదేరడంతో, నితీష్ కుమార్ రాజ్యసభకు పోటీ చేస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఢిల్లీ రాజకీయాల వైపు తిరిగి రాజ్యసభ సభ్యుడైతే, బీహార్‌లో ముఖ్యమంత్రి పదవి ఖాళీ అవుతుంది. దీంతో భారతీయ



జనతా పార్టీ తన సొంత పార్టీ నేతను ముఖ్యమంత్రిగా నియమించుకునే అవకాశం లభిస్తున్నట్లయింది.ఇదిలావుంటే, బీహార్‌లో ఐదు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జేడీయూ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. నితీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నికయ్యే అవకాశం ఉందని ఇప్పుడు చర్చ జరుగుతోంది. రేపు జేడీయూ శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఈ ప్రధాన మార్పుపై చర్చించే అవకాశం ఉందని భావిస్తున్నారు. నితీష్ కుమార్ కేంద్రంలో ప్రధాన పాత్ర పోషించడానికి అంగీకరిస్తే, బీహార్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం బీజేపీ బలమైన వాదనను వినిపిస్తుంది. సంఖ్యాపరంగా ఔఆం సంకీర్ణంలో బీజేపీ అతిపెద్ద పార్టీ, ముఖ్యమంత్రి పదవి కోసం బలంగా ఉంది.ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ అఖండ విజయం సాధించింది. రాష్ట్ర శాసనసభలో 200 సీట్ల మార్కును సునాయాసంగా దాటింది. ఎన్డీయే కూటమి ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను తమ నాయకుడిగా బరిలోకి దిగింది. ఆ వ్యూహం భారీ మెజారిటీతో ఫలించింది. భారతీయ జనతా పార్టీ 89 స్థానాలను గెలుచుకుని రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించింది. దాని కీలక మిత్రపక్షమైన జనతాదళ్ (యునైటెడ్) స్థానాలతో ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. ఇది ఎన్డిఎ అధికారాన్ని బలోపేతం చేసింది.కూటమిలోని ఇతర భాగస్వాములు కూడా నిర్ణయాత్మక ఫలితాలను సాధించారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 19 స్థానాలను గెలుచుకుంది. కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా (లౌకిక) ఐదు స్థానాలను గెలుచుకుంది. అదే సమయంలో, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా నాలుగు స్థానాలను గెలుచుకుంది.

# ఏపీ బియ్యం తెలంగాణకు..

ఏలూరు, మార్చి 4,

ఏపీలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. నిత్యం ఏదో ఒక చోట రేషన్ బియ్యం పట్టుపడుతూనే ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో విధాలుగా కట్టడి చేసే ప్రయత్నం చేసింది. కానీ అడ్డుకట్ట పడడమే లేదు. ముఖ్యంగా కాకినాడ పోర్టు ద్వారా పెద్ద ఎత్తున రేషన్ బియ్యం తరలిపోతుందన్న ఆరోపణలు నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందుకు తగ్గట్టుగానే భారీ షిప్ పై తరలిపోతున్న రేషన్ బియ్యం పట్టుబడింది. అప్పటినుంచి కాకినాడ పోర్ట్ పై ప్రత్యేక నిఘా ఉంది. అయితే ఆ పోర్టుపై రేషన్ బియ్యం తరలింపు ఆగిన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం రవాణా కొనసాగుతూనే ఉంది.రేషన్ బియ్యం విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతూ వచ్చింది. తనిఖీలను ముమ్మరం చేసింది. అయినా సరే కట్టడి జరగడం లేదు. కొంతమంది మిల్లర్లు, వ్యాపారులు కుమ్మక్కై ఈ దందాకు పాల్పడుతున్నారని స్పష్టమవుతోంది. గ్రామాల్లో కమిషన్ ఏజెంట్లను నియమించుకొని.. ప్రజలు రేషన్ బియ్యం విడిపించిన వెంటనే ఆ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అదే బియ్యాన్ని కమీషన్ ప్రాతిపదికన మిల్లర్లకు విక్రయిస్తున్నారు. అదే బియ్యం రీ పాలిష్ చేసి లెవీకి పంపుతున్నారు. అదే బియ్యాన్ని మళ్లీ రేషన్ బియ్యం గా మార్చేస్తున్నారు. ఈ దందా కొనసాగుతూనే ఉంది. అయితే తెలంగాణ బియ్యం ఏపీకి.. ఏపీ బియ్యం తెలంగాణకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా తెలంగాణ నుంచి ఏపీకి తరలిస్తున్న బియ్యం నల్గొండ జిల్లాలో పట్టుబడింది.ఇప్పటివరకు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు అక్రమార్కులు. కానీ ఇప్పుడు తెలంగాణ నుంచి ఏపీకి బియ్యం తీసుకొచ్చి చలామణి చేస్తున్నారు. సన్న బియ్యం పేరిట విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారులు రేషన్ విడిపించిన వెంటనే వారి నుంచి 15 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసినందుకు గాను మధ్య వ్యక్తులకు మిల్లర్లు, వ్యాపారులు కిలో దగ్గర నాలుగు రూపాయలు అందిస్తున్నారు. అదే బియ్యాన్ని ఏపీలో 25 రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అంటే కిలో దగ్గర పది రూపాయలు దోపిడీ కొనసాగుతోందన్నమాట. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడడంతో అసలు విషయం బయటకు వచ్చింది. గత కొద్దిరోజులుగా ఈ దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎక్కడికక్కడే తనిఖీల ద్వారా ఈ రేషన్ బియ్యం రవాణా కు చెక్ పెట్టేందుకు రెండు రాష్ట్రాల అధికారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. విస్తృత తనిఖీలు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే బియ్యం రవాణా కట్టడికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగడం విశేషం.

# ఖమేనీ కోసం సీఐఏ పక్కాప్లాన్

బాగ్దాద్, మార్చి 5,

హ్రాన్ నగరం? ఉదయం 8గంటలకు ఆ రోజు కూడా రోజూ లాగానే నడుస్తోంది. కానీ ఓ గంటసేపట్లోనే ఊహకందని విధ్వంసం వాళ్ల కళ్లకు కనిపించింది. ఇజ్రాయెల్‌లోని 1200 మైళ్ల దూరం నుంచి వచ్చిన సూపర్ జెట్లు.. ఆ దేశ సుప్రీం లీడర్ ఖమైనీ భూగర్భ గృహాన్ని కూలచేశాయి. ఆయన్ను ఖతం చేశాయి. మిలటరీ దాడుల చరిత్రలోనే అత్యంత పకడ్బందీగా.. సంక్లిష్టంగా జరిగిన ఈ ఆపరేషన్ డికాపిటేషన్ చేశారు.. డికాపిటేషన్ అంటే శిరచ్ఛేధం. ఇక్కడ చెప్పుకోవాలంటే ఇరాన్‌ను తల లేని మొండెం చేయడమే. ఇరాన్ ఐడెంటిటీ ఆ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమైనీ.. ఆయన్ను పడగొడితే ఇరాన్‌ను పడగొట్టినట్లే. యుద్ధమంటే వారాలు, నెలల తరబడీ సాగనవసరం లేదని నిరూపించిన ఆపరేషన్ ఇది. ఇరానీయన్ సుప్రీం లీడర్ ఖమైనీ బంకర్‌ను బద్ధలకొట్టం వెనుక.. సీఐఏ , మోసాద్ ఏళ్ల తరబడీ సాగించిన ఇంటెలిజెన్స్ ఆపరేషన్ ఉంది. ఇరాన్‌లో కమ్యునికేషన్ వ్యవస్థలను బద్ధలు కొట్టి.. అక్కడి సీసీ కెమెరాలను హ్యాక్ చేసి, తమ మనుషులను ఖమేనీ కోర్ టీమ్‌లోకి పంపించి.. శాటిలైట్ చానళ్లతో ఆనవాళ్లు రాబట్టి.. ఎయిర్ డిఫెన్స్‌ను ఏమార్చి.. 200 ఫైటర్‌జెట్లను పంపించి.. ఇలా చాలా చాలా చేసి.. ఏక్‌దమ్ ఓకేసారి నేలమట్టం చేశారు.అయతుల్లా అలీ ఖమేనీని కొన్నేళ్లుగా వెంటాడుతున్నాయి ఇజ్రాయెల్ గూఢచారులు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను తమ అరచేతిలోకి తెచ్చుకున్నారు. "మాకు టెహ్రాన్ నగరం మా జెరూసలేం అంత బాగా తెలుసు" అని ఒక ఇజ్రాయెల్ గూఢచారి అధికారి వ్యాఖ్యానించడం వెనుక ఉన్న అసలు రహస్యం.. టెహ్రాన్ వీధుల్లోని ట్రాఫిక్ కెమెరాలు . అవును, టెహ్రాన్ నగరంలోని దాదాపు ప్రతి ట్రాఫిక్ కెమెరాను ఇజ్రాయెల్ ఏళ్ల క్రితమే హ్యాక్ చేసింది. ఆ కెమెరాల ద్వారా వచ్చే ప్రతి దృశ్యం ఎన్‌క్రిప్ట్ చేసి మరీ నేరుగా టెల్ అవీవ్‌లోని సర్వర్లకు చేరేది. ఖమేనీ కార్యాలయం ఉన్న పాశ్చర్ స్ట్రీట్ కెమెరాను కూడా ఇజ్రాయెల్ తన ఆధీనంలోకి తీసుకోగలిగిందంటే వాళ్లు ఏ రేంజ్ లో టెహ్రాన్‌లోకి చొచ్చుకుపోయారో అర్థం చేసుకోవచ్చు. ఆ ఒక్క కెమెరా ద్వారా ఖమేనీ కదలికలను పసిగట్టేవారు. బాడీగార్డులు తమ వ్యక్తిగత కార్లను ఎక్కడ పార్క్ చేస్తారు, వారు ఏ సమయంలో విధులకు వస్తారు, వారి దినచర్య ఏమిటి అనేవన్నీ ఇజ్రాయెల్ విశ్లేషకులు కూర్చొని గమనించేవారు. ఇజ్రాయెల్ ఇంటిలెజెన్స్ ఓ సీక్రెట్ అల్గారిథమ్ ను కూడా రూపొందించింది. దీని ఆధారంగా ఖమేనీ భద్రతా సిబ్బంది అడ్రెస్‌లు వారి ఫోన్ నెంబర్లు, ప్రయాణించే మార్గాలతో డేటాబేస్ సిద్ధం అయింది. కొన్ని కోట్ల డేటా పాయింట్లు విశ్లేషించి ఖమేనీ ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో సమావేశం కాబోతున్నారో గంటల ముందే పసిగట్టే స్థాయికి మొసాద్ చేరుకుంది. ఇంకోవైపు సీఐఏ తన మనుషులను ఖమేనీ కోర్ గ్రూపులో చేర్చింది. ఆ రోజు.. ఉదయం ఖమేనీ తన మిలటరీ వ్యూహకర్తలు, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, రాజకీయ ప్రముఖులతో పాశ్చర్ స్ట్రీట్‌లోని తన నివాసంలో సమావేశం అవుతున్నట్లు ఆ లీడ్ కూడా కన్ఫామ్ చేశారు. మోసాద్ వెంటనే ఖమేనీ ఉన్న పాశ్చర్ స్ట్రీట్ సమీపంలోని 12 మొబైల్ టవర్లనుహ్యాక్ చేసి జామ్ చేసింది. ఎవరైనా ఖమేనీ భద్రతా సిబ్బందికి ఫోన్ చేస్తే అది నిరంతరం బిజీ అని వచ్చేలా చేశారు. దీనివల్ల దాడి జరగబోతోందని ఎవరైనా హెచ్చరించాలనుకున్నా ఆసమాచారం లోపలికి వెళ్లకుండా కట్టడి చేశారు. శనివారం ఉదయం ఖమేనీ తన కార్యాలయంలో సమావేశానికి వస్తున్నట్లు ట్రాఫిక్ కెమెరాలు, సిగ్నల్ ఇంటెలిజెన్స్ ద్వారా నిర్ధారించుకున్న ఇజ్రాయెల్.. ఆపరేషన్ మొదలు పెట్టింది. దీనికి ముడంచెల వ్యూహాన్ని చేపట్టారు. ముందుగా వాళ్ల రాడార్‌లోకి డికాయ్ ఆపరేషన్ చేసి.. వాటిని కన్ఫ్యూజ్ చేశారు. పక్కనే ఉన్న సముద్రంలో నుంచి టామ్‌హాక్ క్షిపణులు వెళ్లి.. ఎయిర్‌డిఫెన్స్ ను నాశనం చేశాయి. అంతే కాదు. రాబోయే ఎయిర్ క్రాఫ్టలకు ఎయిర్ ఫీల్డ్‌ను క్లియర్ చేసి పెట్టాయి. ఆ తర్వాత ఈ-35, ఈ-22లు , :2 స్పిరిట్ బాంబర్లు విధ్వంసం చేశాయి. దీనిపై డీటెయిల్డ్ గా ఈ కథనంలో చూడండి. ఇక ఆరోజన టామ్ హాక్‌లు ఎయిర్‌ఫీల్డ్‌ను క్లియర్ చేశాక.. 200 సూపర్‌జెట్లు టెహ్రాన్ మీదకు దూసుకెళ్లాయి. టామ్‌హాక్‌లు మిగిల్చిన పని పూర్తి చేయడం తో పాటు.. మిగిలిన లక్ష్యాలను కూల్చేశాయి. ఈ 200 సూపర్‌జెట్లు మధ్యలో ఓ స్పెషల్ స్క్వాడ్రన్ ఉంది. దాని లక్ష్యం మాత్రం అలీ ఖమైనీ అధికారిక నివాసం బైత్ రెహ్బరీ సముదాయం. ఇది బంకర్ బస్టర్ మ్యూనిషన్లతో రెడీ గా ఉంది. ఈ బంకర్ బస్టర్లు భూమిపైనే కాదు.. భూమిలోపల ఉన్న కాంక్రీట్ బిల్డింగులను కూడా చేధించి లోపలకు వెళ్లాక పేలతాయి. బైత్ రహ్బరీ సాధారణ నివాసం కాదు. ఇది బహుళ స్థాయిల భూగర్భ నిర్మాణం. డికాపిటేషన్ స్ట్రైక్‌లో ప్రధానసూత్రం ? "నాయకత్వం ఒకే చోట ఉన్నప్పుడు దాడి చేయాలి." ఏకంగా 30 మ్యూనిషన్లను ఆ ఇంటిపై వేశారని అంచనా.. ఆ దెబ్బతో ఆ చుట్టుపక్కల చిన్నపాటి భూకంపమే వచ్చింది. ఇరాన్ సుప్రీం లీడర్.. ఆ దేశంలోని ముఖ్యమైన మిలటరీ, రాజకీయ నాయకత్వం భూమి పొరల్లో కలిసిపోయారు. అతను ఆ సమయంలో లెవల్-2 బంకర్‌లో కాకుండా కాస్త పైన ఉన్న బంకర్‌లో ఉండటం కూడా ఇజ్రాయెల్. యుఎస్‌కు కలిసొచ్చింది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం: ఇప్పటి యుద్ధం కేవలం బాంబుల గురించి కాదు.ఇది డేటా గురించి.. అల్గారిథమ్స్ గురించి.. తక్షణ తీసుకోవలసిన నిర్ణయాల గురించి.. చూశారుగా మోస్సాద్, సీఐఏ ఎంత షార్ప్‌గా ప్లాన్ ఎగ్జిక్యూట్ చేశాయో.. ఓ వెబ్ సిరీస్ తీసేంత మెటీరియల్ ఉంది. త్వరలో ఎలాగో ఇవి డాక్యుమెంటరీలుగా వస్తాయి.

# ఏలూరు నగరంలో కార్డన్ అండ్ సెర్చ్

ఏలూరు మార్చి 5, ఆపరేషన్ "వజ్రప్రహార్"లో భాగంగా ఏలూరులో భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ను పోలీస్ మరియు ఈగల్ టీమ్ సభ్యులు ఉమ్మడిగా ఏలూరు వై ఎస్ ఆర్, కాలనీ లో నిర్వహించారు. వైఎస్ఆర్ కాలనీ, పోనంగి పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.పోలీస్ శాఖ, ఈగల్ టీమ్ విభాగానికి చెందిన సుమారు 50 మంది సిబ్బంది ఈ ఆపరేషన్లో పాల్గొన్నారు.. గురువారం తెల్లవారుజాము నుండే ఆయా ప్రాంతా లను చుట్టు ముట్టి ప్రతి ఇంటిని మరియు అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సత్యనారాయణ 1 టౌన్ సిఐ, అశోక్ కుమార్ 2 టౌన్ సిఐ, కోటే శ్వరరావు 3 టౌన్ సిఐ, ఈగల్ టీమ్ ఆర్.ఎస్. ఐ ఉదయ భాస్కర్, నలుగురు నలుగురు సబ్ ఇన్స్పెక్టర్లు , ఈగల్ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ ఆపరేషన్ సందర్భంగా సరైన పత్రాలు లేని 14 మోటార్ సైకిళ్ల ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ?? గంజాయి నిల్వలు, అక్రమ రవాణా మరి యు ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడే అనుమా నితులపై నిఘా పెంచారు. తనిఖీల అనంతరం అధికారులు స్థానిక ప్రజలతో మాట్లాడి పలు కీలక సూచనలు చేసారు. మత్తు పదార్థాల అనర్థాలు గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల యువత భవి ష్యత్తు నాశనమ వుతుందని, అటువంటి అసాంఘిక కార్యక లాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# ఖమ్మంలో కేడీ దంపతులు

ఖమ్మం, మార్చి 5,

భార్యాభర్తలిద్దరూ.. ఎల్ఐసీ ఏజెంట్లు.. అందరినీ.. మంచిగా బోల్తా కొట్టించి.. ఎల్ఐసీ కట్టించేవారు.. ఈ క్రమంలోనే.. ఓ భారీ స్కామ్ కు తెరలేపారు.. సినీ ఫక్కీలో భారీ మోసానికి పాల్పడి కోట్లు కొట్టేశారు. ఈ షాకింగ్ ఘటన భద్రాచలంలో చోటుచేసుకుంది. భార్యాభర్తలైన ఇద్దరు ఏజెంట్లు.. భద్రాచలం ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో సినీ ఫక్కీలో భారీ మోసానికి పాల్పడి కోట్లు కొట్టేశారు. వివరాల ప్రకారం.. అశ్వాపురం మండలానికి చెందిన అలువాల వెంకటేశ్వర్లు లో జోనల్ క్లబ్ మెంబర్ గా ఉండగా.. అతని భార్య సరస్వతి ఏజెంటుగా పని చేస్తుంది. ఇక వీరిద్దరూ నిరుపేదలు, అమాయకులను ఆసరాగా చేసుకొని అశ్వాపురం సీతారాంపురం, నెల్లిపాక బంజర ప్రాంతాల్లో పాలసీలు కట్టిచ్చారు.. అయితే.. వారు బతికుండగానే 39 మంది నకిలీ మరణ ధృవీకరణ పత్రాలను సృష్టించి.. ఏకంగా రూ. 1.52 కోట్లను కాజేశారు ఈ కేటుగాళ్లు.బతికున్న వ్యక్తులను చనిపోయినట్లుగా చిత్రీకరించి, గ్రీన్ ఇంకుతో గెజిటెడ్ సంతకాలు పెట్టి, నకిలీ పత్రాలతో క్లెయిమ్‌లు పొందిన ఈ ఘరానా మోసం స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో, ఈ కేటుగాళ్లు సులభంగా కోటిన్నర రూపాయలకు పైగా సొమ్మును డ్రా చేసుకున్నారు.అయితే.. అంతర్గత తనిఖీల్లో ఈ అక్రమాలు బయటపడటంతో భద్రాచలం బ్రాంచ్ మేనేజర్ చక్రవర్తి భద్రాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇంత భారీ మొత్తంలో నగదు పక్కదారి పడుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు గుర్తించలేకపోయారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.??భద్రాచలం బ్రాంచ్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతుండటంతో పాలసీదారుల్లో ఆందోళన మొదలైంది.? బ్రాంచ్ అధికారుల సహకారం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో స్కామ్ జరగడం సాధ్యమేనా?? నకిలీ పత్రాలను వెరిఫై చేయడంలో సిబ్బంది ఎందుకు విఫలమయ్యారు? ?సాధారణ ప్రజలకు క్లెయిమ్ రావాలంటే నెలల తరబడి తిప్పించే అధికారులు, ఈ కేటుగాళ్లకు ఎలా సహకరించారు? ?అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుల సొమ్ముకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వ సంస్థలో ఇలాంటి ఘరానా మోసాలు చోటుచేసుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# తృణమూల్ ఎంపీగా హైదరాబాదీ...

హైదరాబాద్, మార్చి 5,

తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో మరోసారి తనదైన ముద్ర వేశారు. రాజకీయాలకు అతీతంగా, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని పార్లమెంటుకు పంపే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఈసారి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామిని బరిలోకి దింపారు. ఈ ఎంపిక భారత పార్లమెంటరీ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి తెరలేపడమే కాకుండా, తెలంగాణ గడ్డ గర్వించదగ్గ మరో మైలురాయిగా నిలవనుంది.మేనకా గురుస్వామి కేవలం సుప్రీంకోర్టులో పేరున్న న్యాయవాది మాత్రమే కాదు, ఆమె మూలాలు తెలంగాణలో ఉన్నాయి. ప్రముఖ ఆర్థికవేత్త, రాజకీయ విశ్లేషకులు మోహన్ గురుస్వామి కుమార్తెగా ఆమెకు మేధోపరమైన వారసత్వం అందింది. ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ వంటి ప్రపంచ ప్రసిద్ధ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించిన మేనక, ఐక్యరాజ్యసమితి న్యాయ విభాగంలోనూ సేవలందించారు. అటు అంతర్జాతీయ వేదికలపై, ఇటు దేశ అత్యున్నత న్యాయస్థానంలో సంక్లిష్టమైన కేసులను వాదించి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.మేనకా గురుస్వామి పేరు దేశవ్యాప్తంగా మారుమోగడానికి ప్రధాన కారణం 'సెక్షన్ 377' పై ఆమె చేసిన న్యాయపోరాటం. బ్రిటిష్ కాలం నాటి స్వలింగ సంపర్క వ్యతిరేక చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఆమె వినిపించిన వాదనలు చారిత్రాత్మకమైనవి. ఎల్‌జీబీటీక్యూ వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆమె, వ్యక్తిగతంగా కూడా ఆ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడు రాజ్యసభకు ఎన్నికైతే, భారత పార్లమెంటులో అడుగుపెట్టిన తొలి 'ఓపెన్లీ ఎల్‌జీబీటీక్యూ' ఎంపీగా ఆమె రికార్డు సృష్టించనున్నారుఇటీవలి కాలంలో జాతీయ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ కేసులోనూ మేనక తన న్యాయ ప్రతిభను చాటారు. ముఖ్యంగా సిబిఐ వాడిన "సదరన్ గ్రూప్" అనే పదం నిందితులకు ఆపాదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆమె చేసిన న్యాయపోరాటం సత్ఫలితాలను ఇచ్చింది. రాజకీయంగా అత్యంత సున్నితమైన కేసులలో కూడా తలపండిన న్యాయవాదిగా ఆమె తన పట్టును నిరూపించుకున్నారు. గతంలో సాగరికా ఘోష్ వంటి జర్నలిస్టులను రాజ్యసభకు పంపిన మమత, ఇప్పుడు మేనకా గురుస్వామిని ఎంపిక చేయడం వెనుక స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. పార్లమెంటులో చట్టాల రూపకల్పన సమయంలో రాజ్యాంగబద్ధమైన, న్యాయపరమైన లోతుపాతులు తెలిసిన వ్యక్తులు ఉండటం తృణమూల్ కాంగ్రెస్‌కు జాతీయ స్థాయిలో బలాన్ని ఇస్తుంది. సామాజిక హక్కుల కోసం పోరాడే వ్యక్తిని ఎంపీగా పంపడం ద్వారా టీఎంసీ ఒక లిబరల్, ప్రోగ్రెసివ్ పార్టీగా తన ఇమేజ్‌ను పెంచుకోవాలని చూస్తోంది. బెంగాల్ నుంచి ఇతర ప్రాంతాల మేధావులను ఎంపిక చేయడం ద్వారా పార్టీని కేవలం ఒక ప్రాంతీయ శక్తిగా కాకుండా జాతీయ శక్తిగా ప్రొజెక్ట్ చేసే ప్రయత్నం జరుగుతోంది.తెలంగాణ బిడ్డగా, రాజ్యాంగ రక్షకురాలిగా, సామాజిక హక్కుల గొంతుకగా మేనకా గురుస్వామి ప్రస్థానం స్ఫూర్తిదాయకం. కేవలం న్యాయవాదిగానే కాకుండా, పార్లమెంటేరియన్‌గా ఆమె దేశ చట్టసభల్లో ఎటువంటి మార్పులు తీసుకువస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒక తెలుగు మహిళ పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించడం మనందరికీ గర్వకారణం. మార్చి 16న జరిగే ఎన్నికల తర్వాత ఆమె పార్లమెంటులో అడుగుపెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

# స్మార్ట్ ఫోన్ తో జనాభా గణన

హైదరాబాద్, మార్చి 5,

భారతదేశ పరిపాలనా చరిత్రలో అత్యంత కీలకమైన జనాభా గణన ప్రక్రియ ఈసారి సరికొత్త రూపు సంతరించుకోబోతోంది. తెలంగాణ ఈ బృహత్తర కార్యక్రమానికి సర్వసన్నద్ధమైంది. దశాబ్దాలుగా కాగితం, కలంతో సాగుతున్న ఈ సంప్రదాయ ప్రక్రియ, ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్ల ద్వారా డిజిటల్ రూపంలోకి మారుతోంది. మే 11 నుంచి జూన్ 9 వరకు జరగనున్న ఈ తొలి దశ గణన కేవలం అంకెలను సేకరించడం మాత్రమే కాదు, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు ఒక దిక్సూచిగా మారనుంది.జనగణనలో భాగంగా మే 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు, కట్టడాల వివరాలను నమోదు చేస్తారు. ప్రభుత్వం నియమించిన గణకులు ప్రతి ఇంటికీ వెళ్లి, ఆ ఇంటి రకం, వసతులు, ఇతర మౌలిక సదుపాయాల వివరాలను సేకరిస్తారు. మారుమూల గిరిజన తండాల నుంచి హైటెక్ సిటీలోని బహుళ అంతస్తుల భవనాల వరకు ఏ ఒక్క కట్టడాన్ని వదలకుండా లెక్కించాలని ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది.ఈసారి జనగణనలో ప్రధాన ఆకర్షణ డిజిటల్ విధానం. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని వివరాలను నేరుగా మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారు. దీనివల్ల సమాచారం సేకరించిన వెంటనే సర్వర్‌లోకి చేరుతుంది, తద్వారా గతంలో ఎదురైన డేటా ఎంట్రీ జాప్యం, తప్పులకు ఆస్కారం ఉండదు. ఆధునిక యుగంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం 'సెల్ఫ్-ఎన్యూమరేషన్' పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తోంది. మే 11 కంటే 15 రోజుల ముందు నుంచే పౌరులు తమ వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఇది విద్యావంతులు, పట్టణ వాసులకు సమయం ఆదా చేయడమే కాకుండా, గోప్యతను కూడా కాపాడుతుంది.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఎన్యూమరేటర్లకు యాప్ వాడకంపై, డేటా సెక్యూరిటీపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మ్యాపింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా భౌగోళిక సరిహద్దులను ముందే ఖరారు చేశారు.జనాభా గణన కేవలం జనాభాను లెక్కించడం మాత్రమే కాదు. ఇది ఒక రాష్ట్ర ఆర్థిక, సామాజిక స్థితిగతులను ప్రతిబింబిస్తుంది. డిజిటల్ డేటా వల్ల రాష్ట్రంలో ఎన్ని పేద కుటుంబాలు ఉన్నాయి, తాగునీరు, గ్యాస్ కనెక్షన్ వంటి సదుపాయాలు ఎంత మందికి అందుతున్నాయి అనే అంశాలపై కచ్చితమైన అంకెలు వస్తాయి. దీనివల్ల సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చు. జనాభా నిష్పత్తిని బట్టి నిధుల కేటాయింపు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల్లో ఈ గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయి. గతంలో ఫలితాలు రావడానికి ఏళ్లు పట్టేది. ఇప్పుడు డిజిటల్ విధానం వల్ల కొద్ది నెలల్లోనే ప్రాథమిక నివేదికలు సిద్ధమయ్యే అవకాశం ఉంది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ డిజిటల్ జనగణన విజయవంతం కావాలంటే పౌరుల సహకారం అత్యంత అవసరం. తప్పుడు సమాచారం ఇవ్వకుండా, గణకులకు సహకరిస్తేనే రాష్ట్ర ప్రగతికి బాటలు పడతాయి. సాంకేతికతను సామాజిక ప్రయోజనం కోసం వాడుతున్న ఈ ప్రక్రియ, తెలంగాణను 'డిజిటల్ గవర్నెన్స్'లో మరో మెట్టు ఎక్కించనుంది.



# అడ్డగోలగా కలప స్మగ్లింగ్

నిజామాబాద్, మార్చి 5, (



అటవీ ప్రాంతాల్లో చెట్ల నరికివేతతో వృక్షాలు వినిపిస్తున్నాయి. స్మగ్లర్ల గుడ్డలు వేటు తో పెద్ద పెద్ద చెట్లు నేల కొరకుతున్నాయి. రాత్రి వేళలో జరుగుతున్నాయి. అటవీ శాఖ అధికారులు తమకేమీ పట్టించుకోనట్టుగా వ్య వరించడంతో ఈ తతంగం కొనసాగుతుంది. స్మగ్లర్లు, అటవీశాఖ అధికారులు కలిసి కలప స్మగ్లింగ్ కు అవకాశం ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.అటవీ ప్రాంతాలను కబ్జా గురైనప్పటికీ పట్టించుకోని అధికారులు, ఇటు అటవి సంపదను కూడా పట్టించుకున్న పాపను పోవడం లేదు. రాత్రి వేళల్లో చెట్లను నరకడం, టాక్టర్లలో డంపు చేయడం ఈ స్మగ్లర్లకు అలవాటుగా మారిపోయింది. అటు అటవీశాఖ అధికారులు కానీ, పోలీస్ శాఖ అధికారులు కానీ పట్టించుకున్న పాపాలు పోవడం లేదు. కల్ప తరలిపోతున్న వీరు ఆ దిశగా దృష్టి సారించలేం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్ని, బాన్సువాడ, కోనాపూర్, హనుమాజిపేట్, బడాపాడు, రుద్రూర్, ప్రాంతాల నుండి కల్ప స్మగ్లింగ్ జరుగుతున్నట్లు సమాచారం. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరుడు ఈ వ్యాపకాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుని కల్ప స్మగ్లింగ్కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే పేరును చెప్పుకొని సదరు నాయకుడు తనకున్న వ్యాపారాన్ని నెరవేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రాజకీయ ముసుగుల జరుగుతున్న ఈ తతంగం అటవీ ప్రాంతాల్లో వృక్షాలను తెగ నరికేసే స్థాయికి వచ్చింది. అధికారులు పట్టించుకోకపోవడమా..? పోలీసు అధికారులు అటువైపుగా అదృష్ట సాధించకపోవడమా...? ఏదో ఏమో కానీ వీరి దందా మాత్రం కొనసాగుతోంది. అటవీ ప్రాంతాలలోని విలువైన టేకు, ఇతర చెట్లను కలప స్మగ్లర్లు ఇష్టం వచ్చినట్లు నరుకుతున్నారు. పట్టపగలే నెంబర్ ప్లేట్లు లేని బండ్లపై వచ్చి కలప దుంగలను కొడుతున్నారు. పగలు సేకరించిన కలపను అటవీ ప్రాంతాల్లోనే దాచి అర్థ రాత్రులు అక్రమంగా తరలిస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఈ తంతు సాగుతున్నప్పటికీ ఫారెస్ట్ ఆఫీసర్లు మాత్రం తమకేమీ పట్టదు అన్నట్లుగా వ్యవరిస్తున్నారు. ఫీల్ వెరిఫికేషన్ కు దూరంగా ఉంటూ కార్యాలయాల్లోనే కాలక్షేపం చేస్తున్నారని అటవీ శాఖ అధికారులపై స్థానికులు మండిపడుతున్నారు.విలువైన కలప నరికివేత అక్రమ రవాణాలో స్థానికంగా ఉన్న ఓ చోటా లీడర్ స్మగ్లర్ ను మించిపోయాడు. బిచ్కుంద మండలంలోని అన్ని గ్రామాలలో సంచరిస్తున్న ఓ కలప స్మగ్లింగ్ ముఠా దమ్ముంటే పట్టుకోండి అంటూ ఫారెస్ట్, పోలీస్ డిపార్ట్మెంట్ ఆఫీసర్లకు సవాల్ విసురుతున్నారు. గత కొంతకాలంగా ఈ మండలంలో సంచరిస్తున్న ఈ ముఠా సభ్యులు విలువైన కలప దుంగలను రాత్రికి రాత్రే తరలిస్తున్నారుఈ క్రమంలో కేవలం ఫారెస్ట్ భూముల్లోని చెట్లను మాత్రమే కాకుండా పొలాల వద్ద ఏపుగా పెరిగిన రైతులకు చెందిన టేకు చెట్లను సైతం నయానో బయానో చెల్లించిఎత్తుకెళు న్నారు. పొలం గట్ల వెంబడి పలువురు రైతులకు చెందిన ఏపుగా పెరిగిన కలప చెట్లను దుంగలుగ కొట్టి ఎత్తుకెళ్తున్నారు. ఓవైపు ప్రభుత్వం వనమహోత్సవం పేరుతో అటవీ సంపదను పెంపొందించే ప్రయత్నం చేస్తుంటే కలవ స్మగ్లింగ్ జీవనాధారంగా ఎంచుకున్న కొందరు ఇష్టం వచ్చినట్లు అడవుల నరుకుతున్నారు. దీంతో అడవుల నరికివేత వన్యప్రాణులకు ముప్పుగా మారింది.ఈ క్రమంలో ఆహారం నీరు దొరకక వన్యప్రాణులు సమీప గ్రామాలలోకి వస్తూ వేటగాళ్ల ఉచ్చులో పడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో జింకలు, దుప్పులు వంటి వాటిని యువత కాపాడి ఫారెస్ట్ అధికారులకు అప్పచెప్పుతున్నారు. కానీ వెలుగులోకి రాకుండా వన్యప్రాణులు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి.అటవీ సంపద రక్షణ పట్ల ఫారెస్ట్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఫీల్ వర్క్ కు దూరంగా ఉంటూ ఎక్కువ భాగం ఆఫీస్ పనులకే పరిమితమయ్యారన్న వాదనలు లేకపోలేదు. అడవుల నరికివేత వన్యప్రాణుల వేట వంటి తదితర విషయాల్లో ఎవరైనా సమాచారం ఇస్తే తప్ప దాడులు జరపడం లేదన్న అపవాదు మూటగట్టుకుంటున్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బిచ్కుంద మండలంలో గతంలో ఓ రెండు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున అడవులను ధ్వంసం చేసి భూమి చదును చేశారు. అయితే ఇలాంటి ఘటనలు మండలంలో అనేక చోట్ల జరుగుతున్నాయని అటవీ సంపద రక్షణతో పాటు వన్యప్రాణులు, అటవీ భూముల సంరక్షణకు ఫారెస్ట్ అధికారులు మరిన్ని పటిష్ట చర్యలు చేపట్టాలని పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# 25 వేల మంది నకిలీ ఉద్యోగులా...

హైదరాబాద్, మార్చి 5,

సాధారణంగా దొంగలు పడితే ఇంట్లో సామాన్లు పోతాయి, కానీ మన తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాల్లో దొంగలు పడితే ఏకంగా 'ఉద్యోగాలే' పుట్టుకొచ్చాయి! సినిమాల్లో చూపిస్తే లాజిక్ అడుగుతామని భయపడి డైరెక్టర్లు కూడా టచ్ చేయని ఒక అద్భుతమైన 'సైన్స్ ఫిక్షన్' కథ మన రాష్ట్రంలో ఇన్నేళ్లుగా నిశ్శబ్దంగా నడిచిపోతోంది.రాష్ట్రంలో సుమారు 25 వేల మంది ఉద్యోగులు ఉన్నారట. వీరు ఆఫీసులకు వస్తారు పేపర్ల మీద.. పని చేస్తారు ఫైళ్ల మీద.. జీతాలు కూడా తీసుకుంటారు బ్యాంకు ఖాతాల్లో? కానీ తీరా చూస్తే? వీరికి ఈ భూమి మీద ఉనికిని చాటే 'ఆధార్ కార్డు' ముక్క కూడా లేదు! అంటే వీరు మనుషులా? లేక ఏజెన్సీలు సృష్టించిన 'డిజిటల్ ఆత్మలా?' అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్న.వీరి క్వాలిఫికేషన్ అడ్డదారిలో నడవగలగడం.. అనుభవం ఏంటంటే ఏజెన్సీల జేబులు నింపడంలో ప్రావీణ్యం సంపాదించడం.. గుర్తింపు కార్డు లేదనడం గాలిలో దీపం, కాగితం మీద సంతకాలుచూపించారు.పాపం, ఈ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఎంచక్కా "కంటికి కనిపించని" ఉద్యోగులతో కోట్లు గడిస్తుంటే.. ఈ కాంగ్రెస్ సర్కార్ ఎఈఓటూ అనే అస్త్రాన్ని బయటకు తీసింది. "మీ వివరాలన్నీ కంప్యూటర్లో పెట్టండి, నేరుగా జీతాలు ఇస్తాం" అని ప్రభుత్వం అనేసరికి, అప్పటివరకు 'ఘోస్ట్ రైడర్స్' లాగా జీతాలు కొట్టేసిన బ్యాచ్ అంతా ఒక్కసారిగా ఆవిరైపోయారు. ఆధార్ లింక్ అనగానే 25 వేల మంది ''మాయా మనుషులు'' మాయమైపోయారు."ఏంటి.. నా రాష్ట్రంలో ఆధార్ లేని అపర మేధావులు 25 వేల మందా?" అని సీఎం రేవంత్ రెడ్డి షాక్ తిన్నారు. వెంటనే కలెక్టర్లకు ఆర్డర్ వేశారు. "ఆ ఏజెన్సీల పని పట్టండి, క్రిమినల్ కేసులు పెట్టండి" అని. ఇన్నాళ్లూ 'పీఎఫ్' అంటే 'పర్సనల్ ఫండ్' అనుకుని నొక్కేసిన ఏజెన్సీలకు ఇప్పుడు అసలైన 'పోలీస్ ఫైల్' సినిమా కనిపిస్తోంది.నిరుద్యోగులు ఏళ్ల తరబడి లైబ్రరీల్లో కళ్లు కాయలు కాచేలా చదువుతుంటే, ఇక్కడ కొందరు మహానుభావులు ఏకంగా 'అడ్రస్' లేకుండానే అడ్మినిస్ట్రేషన్ నడిపించేశారు. నిజంగా వీరికి ఆస్కార్ ఇవ్వకపోయినా, కనీసం 'చంచల్‌గూడ' పాస్ ఇవ్వాలని సర్కార్ డిసైడ్ అయ్యింది!

# ధరణి... భూమాత...డొల్లేనా

కరీంనగర్, మార్చి 5

తెలంగాణలో భూముల దందా? సారీ, భూముల వ్యవహారం అద్భుతం! ప్రభుత్వం మారినా పోర్టల్ పేరు మారినా రైతుల కష్టాలు మాత్రం 'ఎటర్నల్' అన్నట్టు సాగుతున్నాయి. ధరణి పోయి భూ భారతి వచ్చింది. కానీ పాత సమస్యలే కొత్త వేషంలో మళ్ళీ దర్శనమిస్తున్నాయి. పేరు మారిస్తే జాతకం మారుతుందని నమ్మే మన పాలకులకు.. సాఫ్ట్‌వేర్ కూడా అంతే అనిపిస్తుందేమో!'ధరణి'లో వంద రకాల సమస్యలు ఉంటే, వాటిని పరిష్కరిస్తామని వచ్చిన 'భూ భారతి'లో కొత్తగా లొసుగులు బయటపడుతున్నాయి. అంటే పాత సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్తవి బోనస్‌గా వస్తున్నాయన్నమాట. ఇదో రకమైన 'డబుల్ బొనాంజా' రైతులకు!ధరణి ఉన్నప్పుడు స్లాట్ రద్దు చేసుకుంటే కట్టిన డబ్బులు తిరిగి రావడానికి అంతులేని జాప్యం జరిగేది. ఇప్పుడు భూ భారతి వచ్చాక కూడా అదే పరిస్థితి. ప్రభుత్వం దగ్గర డబ్బులు తీసుకోవడం తెలుసు.. కానీ తిరిగి ఇవ్వడం కొంచెం 'కష్టం' కదా మరి!ఇక అతిపెద్ద కామెడీ ఏంటంటే? మీ సేవ ఏజెంట్లు రిజిస్ట్రేషన్ ఛార్జీలను జేబులో వేసుకుంటుంటే సర్కార్ దాన్ని అడ్డుకోలేకపోతోంది. తహశీల్దార్లకు ఆ ఛార్జీలను చూసే అవకాశం లేకపోవడంతో ఏజెంట్లు కోట్లు వెనకేసుకుంటున్నారు. ప్రభుత్వానికి మాత్రం చుక్కెదురు. వరంగల్ పోలీసులే రంగంలోకి దిగి అరెస్టులు చేసే వరకు ఈ వ్యవహారం సర్కారుకు తెలియకపోవడం, వారి 'పనితీరుకు' అద్దం పడుతోంది.

ఈ సమస్యలన్నీ పరిష్కారం కావడానికి, భూ భారతి పోర్టల్ పక్కాగా మారడానికి మరో ఆరు నెలలు పడుతుందని అధికార వర్గాలే చెబుతున్నాయి. అంటే అప్పటివరకు రైతుల తిప్పలు యథాతథమే! పేరు మార్చి ప్రజలను బురిడీ కొట్టించడం కాకుండా సమస్యల మూలాలను పట్టుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారుధరణిలో సమస్యలు ఉంటే భూ భారతి తెచ్చారు, మరి భూ భారతిలో సమస్యలు ఉంటే ఏం తెస్తారు? 'భూ నరకం'? ఏది ఏమైనా తెలంగాణలో భూమి కొన్నా, అమ్మినా.. అది ఒక పెద్ద 'సాహస యాత్రే'!

====================



# విద్యుత్ ఘాతానికి గురయిన విద్యార్థులను పరామర్శించిన మాజీ ఎంపి భరత్

రాజమండ్రి మార్చి 05

విద్యుత్ ఘతానికి గురి అయ్యి ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న ఇద్దరు స్కూలు విద్యార్థులను వైసిపి మాజీ ఎంపీ మార్గాని భరత్ పరామర్శించారు.

భరత్ మాట్లాడుతూ రాజమండ్రి సిటీ, అనుశ్రీ థియేటర్ వద్ద గల ట్రైనింగ్ కాలేజీ ప్రాంగణంలో ఉన్న స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు విద్యుత్ ఘాతానికి గురయ్యారని తెలిసిన వెంటనే పీత రామకృష్ణ బృందానికి తెలియచేసాను. వాళ్లు వివరాలు సేకరించారు. ఇక్కడ దానవాయిపేట సురక్ష హాస్పిటల్ నందు 15 వ వార్డు కు చెందిన యన్ రమేష్, దివాన్ చెరువు కేశవ హాస్పిటల్ లో 27 వ వార్డు కు చెందిన ఉజ్వల ఈశ్వర సాయి చికిత్స పొందుతున్నారు.. స్కూల్ జరుగుతున్న సమయంలో ఇద్దరు పిల్లలు మామిడికాయలు కోయడానికి బయటకు వచ్చి అధ్యాపకులు తిడతారని గోడ దూకే క్రమంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ షాక్ కు గురి అయ్యి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు..విద్యా శాఖ అధికారులు వచ్చి తలొక పది వేల రూపాయలు వైద్య ఖర్చులకు ఇచ్చి వెళ్లిపోయారని బాధిత తల్లి తండ్రులు చెపుతున్నారని అన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి తో మాట్లాడి ఈ పిల్లలకు ప్రభుత్వం తరపున వైద్య సహాయం అందించాలని లేకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు..

మొన్న కల్తీ పాల ఘటన, వేట్ల పాలెం బాంబు పేలుడు ఘటన, రెండు రోజుల క్రితం ఈ విద్యార్థుల ఘటన అసలు కూటమి ప్రభుత్వ ఏమి చేస్తుంది బాధితుల కష్టాలు పట్టవా కనీసం పట్టించుకోరా! వెంటనే స్పందించి ఈ విద్యార్థులకు అండగా ప్రభుత్వం నిలబడాలని డిమాండ్ చేసారు.

# ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష




సిద్ధిపేట మార్చి 05

ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల గురించి ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారుజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయా గ్రామంలో ఏంజీ ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన పనులు అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, సబ్ సెంటర్, గ్రామ మహిళా సమాఖ్య, పుడ్ గ్రైన్ స్టోరేజ్, సిసి రోడ్లు, ఆయా పాఠశాలలో ప్రహరీ గోడ, మరుగుదొడ్ల నిర్మాణాల పైన సమీక్షించారు. అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీ గోడ నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన ఈజీఎస్ పనులు పూర్తి చేసి ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ 15 రోజులు అత్యంత కీలకం అని ఆయా నిర్మాణాలు ఒక ప్రణాళిక ప్రకారం రోజు వారిగా ప్రోగ్రెస్ తీసుకురావాలని ఆయా స్థాయిలో నిర్మాణం పూర్తి కాగానే మాస్టర్ జెనరేట్ చేసుకుని అప్లోడ్ చెయ్యాలని తెలిపారు.ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం, మండలం, గ్రామం వారిగా ప్రారంభాలకు సిద్ధం చెయ్యాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, పంచాయతీరాజ్ ఈఈ చిరంజీవి, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ మోటర్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్. రూ1.15 లక్షల నగదు 15 కేజీల రాగి స్వాధీనం.



రుద్రవరం మార్చి 05

నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మరియు ఆళ్లగడ్డ ఎస్డిపిఓ ఆదేశాల మేరకు రుద్రవరం పోలీసులు దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వివిధ మండలాల్లో రైతుల బోర్ల వద్ద విద్యుత్ వైర్లను కట్ చేసి దొంగిలిస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాలో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సిరివెళ్ల సీఐ డి. రాము వెల్లడించారు. గత కొంతకాలంగా రుద్రవరం, మహానంది, గోస్పాడు, సిరివెళ్ల, ఆళ్లగడ్డ, దొర్నిపాడు మరియు చాగలమర్రి మండలాల్లోని పొలాల్లో పంప్ సెట్ల వైర్లు దొంగతనానికి గురవుతున్నాయి. దీనివల్ల రైతులకు ఆర్థికంగానే కాకుండా, సాగు నీరు అందక పంట నష్టం కూడా వాటిల్లుతోంది. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో రుద్రవరం శివారులోని హెచ్.పి పెట్రోల్ బంక్ వద్ద నిందితులు ఉన్నారనే సమాచారంతో ఎస్ఐ జయప్ప, ఏఎస్ఐ భూపాల్ రెడ్డి మరియు వారి బృందం దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో సిరివెళ్ళకు చెందిన ఇండ్ల నరసింహులు, ఇండ్ల వెంకటేశ్వర్లు,ఇండ్ల రంగయ్య, అహోబిలం కు చెందిన యాట చిన్నయ్య ఉన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి దాదాపు 15 కిలోల రాగి వైర్లు మరియు గతంలో దొంగిలించిన సొత్తును విక్రయించగా వచ్చిన రూ. 1,15,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ వైర్లను కొనుగోలు చేస్తున్న సిరివెళ్ల మరియు ఆళ్లగడ్డకు చెందిన గుజరీ షాపుల యజమానులైన షేక్ హుస్సేన్ బాషా, షేక్ మాలిక్ బాషా మరియు షేక్ ఖాదర్ బాషాలను కూడా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దొంగలు పగలు పొలాల్లో తిరిగి ఎక్కడెక్కడ మోటార్లు ఉన్నాయో గమనిస్తారని, ఎవరైనా ప్రశ్నిస్తే "పిట్టల కోసం వచ్చాము" అని నమ్మిస్తారని సీఐ హెచ్చరించారు. రైతులు తమ పొలాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమర్థవంతంగా పనిచేసిన ఎస్ఐ జయప్ప మరియు ఇతర పోలీసు సిబ్బందిని ఉన్నత అధికారులు అభినందించినట్లు తెలిపారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కిమంత్రి-పొన్నం ప్రభాకర్ కౌంటర్

హైదరాబాద్ మార్చి 05



రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీ గా మా హక్కు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది బండి సంజయ్ కాదు, మరో వ్యక్తి కాదు, ప్రజలే న్యాయ నిర్ణేతలు.. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావు. అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయి. ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసు. గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తున్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మీరా మాట్లాడేది ?మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవస్థలు అస్తవ్యస్థంగా మారింది ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నారు.ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి పేదలను ఆదుకునే ప్రయత్నం చేయలేదు,విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనార్టీ లను అణగారిన వర్గాలను బూచిగా చూపి మీరు అధికారాన్ని చెలాయిస్తున్నారు నిత్యం మతవిద్వేశాలు రెచ్చగొడుతూ రాజకీయం చేస్తున్నారు.కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈడి సీబీఐ కేసులతో విపక్ష ప్రభుత్వాలను కూలుస్తు ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న రాజకీయం మీదిదేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశ ప్రజలకు ఐక్యతను చాటి మీ ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తున్న రాహుల్ గాంధీ గారిని విమర్శించడం ఆకాశం మీద ఉమ్మిస్తే మీ ముఖం మీదే పడుతుంది ఆ వాస్తవాన్ని బండి సంజయ్ తెలుసుకోవాలి.రెండు సార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయి తెలంగాణ కు ప్రత్యేక నిధులు తీసుకురాని దద్దమ్మ బండి సంజయ్ మీ వ్యవహారశైలి మార్చుకోవాలి.

# యంగ్ ఇండియా స్కూల్లో భారీ అవినీతి

హైదరాబాద్ మార్చి 05

యంగ్ ఇండియా స్కూల్లో జరిగిన అవినీతి అంత ఇంత కాదు. అన్ని ఆధారాలు ఉన్నాయి, త్వరలో అన్ని బయట పెడుతానని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారు.. అన్ని ఆధారాలు ఉన్నాయి. పరిపాలనలో ముఖ్యమంత్రికి పట్టు రావడం లేదు. ప్రతిపక్షంగా మేము సక్సస్ అయ్యాం. ఖమ్మంకు కేటీఆర్ వెళ్ళాడు ఇప్పుడు స్థలాలు ఇస్తాం అన్నారు ఇండ్లు కట్టిస్తాం అన్నారు. నేను శారదా పీఠం వెళ్ళాను అది ఆపుతున్నాం అన్నారు. దేవాదుల ప్రాజెక్టు వెళ్ళాం వెంటనే ముఖ్యమంత్రి వెళ్ళాడు. హెల్త్ సిటీకి వెళ్ళాం, ప్రతి దానికి మేము వెళ్ళాక స్పందిస్తున్నారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను గాలికి వదిలేశారు. మేము ఉన్నప్పుడు ప్రత్యేక జీవో ఇచ్చాం. ఉద్యోగులకు ఎలా ఉండేదో అలానే జర్నలిస్టులకు ఉండేదని అన్నారు.

రేవంత్ రెడ్డి మేనల్లుడి మనుషులు నియో పోలీస్లో అక్రమ మైనింగ్ చేస్తున్నారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్కు మాత్రమే నిబంధనలుండగా ఫిక్స్ క్రషింగ్ ప్లాంట్ నియోపోలీస్లో పెట్టారు. ల్యాండ్ లీజుకు ఇస్తే 6 నుంచి 7 శాతం ఫీజు కట్టాలి. లెటర్లో పది ఎకరాలు ఇస్తే 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోంది. 15 లక్షల క్యూబిక్ మీటర్ల బండకు ఫీజు ఎగ్గొట్టారు. అక్కడ రెడీమిక్స్కు పర్మిషన్ లేదని అయన అన్నారు.

# ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్టే శ్రీరామ రక్ష... జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున

తుగ్గలి మార్చి 05

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ను ధరించాలని,హెల్మెట్టే వారికి మరియు వారి కుటుంబానికి శ్రీరామరక్ష అని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తెలియజేశారు.బుధవారం రోజున జొన్నగిరి గ్రామంలో మంత్రాలయం ? బెంగళూరు ప్రధాన రహదారిపై వాహనదారులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ మల్లికార్జున మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు అతివేగంతో వాహనాలను నడపరాదని,తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వకూడదని తెలియజేశారు.ఆటో డ్రైవర్లు కూడా పరిమితిని మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించుకోరాదని ఎస్.ఐ తెలియజేశారు.కారులో ప్రయాణించేవారు తప్పక సీట్ బెల్ట్ ను ధరించాలని ఆయన తెలియజేశారు. వాహనదారులందరూ వాహనాలకు సంబంధించిన రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలని తెలియజేశారు.ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధించబడతాయని వాహనదారులను ఎస్.ఐ మల్లికార్జున హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి పోలీసు అధికారులకు సహకరించి గమ్యస్థానాలను సురక్షితంగా చేరాలని జొన్నగిరి ఎస్సై మల్లికార్జున తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జొన్నగిరి పోలీస్ సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ వీడియో పోటీల విజేతలకు వండర్లా ఉచిత కూపన్ల పంపిణీ: :సీపీ రష్మీ పెరుమాళ్

సిద్దిపేట మార్చి 05 సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా వేదికగా నిర్వహించిన మొదటి విడత ఆన్లైన్ షార్ట్ వీడియోల పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు, సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ చేతుల మీదుగా బహుమతులు అందజేసిన విషయం తెలిసిందే.. విజేతలకు 1వ, 2వ మరియు 3వ బహుమతులతో పాటు, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. సిద్దిపేట పోలీసులు రూపొందించిన ఈ వినూత్న కార్యక్రమానికి ఆకర్షితులైన ప్రముఖ వినోద సంస్థ వండర్లా, విజేతలకు ఉచిత ప్రవేశ కూపన్లను స్పాన్సర్ చేసింది. సీపీ సమక్షంలో ఈ కూపన్లను విజేతలకు పంపిణీ చేయడం జరిగింది.షార్ట్ వీడియో కాంటెస్ట్ 2.0 ప్రారంభం:మొదటి విడతకు వచ్చిన అనూహ్య స్పందనతో, ఇప్పుడు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ షార్ట్ వీడియో కాంటెస్ట్ 2.0 ను ప్రారంభించడం జరిగింది. సమాజంలో చైతన్యం నింపేందుకు యువత, కంటెంట్ క్రియేటర్లు మరియు ఇన్ఫ్లుయెన్సర్లు ఈ పోటీలో పాల్గొనాలని సీపీ పిలుపునిచ్చారు.పోటీ అంశాలు: సైబర్ నేరాలపై అవగాహన,మహిళల భద్రత మరియు వేధింపుల నిరోధం, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన, ఈవ్ టీజింగ్ నిరోధం మాదక ద్రవ్యాల నిర్మూలన,సామాజిక బాధ్యతతో కూడిన వీడియోలను రూపొందించి, సోషల్ మీడియాలో మా అధికారిక ఖాతాలను ట్యాగ్ చేయండి.

# అభివృద్ధి పేరుతో మోసం.. నిర్వాసితులకు అండగా ఉంటాం


* ఆర్సీఐ ఎదుట అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా
* మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి డిమాండ్




బాలాపూర్, మార్చి 05 (భారత శక్తి): భివృద్ధి పేరుతో భూములు లాక్కొని, నిరుపేద నిర్వాసిత కుటుంబాలను నట్టేట ముంచడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి ధ్వజమెత్తారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ డివిజన్ పరిధిలోని ఆర్సీఐ (RCI) సంస్థ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన బాధితులకు మద్దతుగా అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం సంస్థ స్థాపన సమయంలో భూములు కోల్పోయిన 96 కుటుంబాలకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి, నేటికీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు. "భూములు ఇచ్చిన వారికి ఉపాధి కల్పించకుండా సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. బాధితులకు న్యాయం జరిగే వరకు, వారికి ఉద్యోగాలు ఇచ్చే వరకు అందరం ఏకతాటిపై ఉండి పోరాడుతాం. నిర్వాసితుల పక్షాన విశ్రమించే ప్రసక్తే లేదు" అని ఆయన స్పష్టం చేశారు.

**తరలివచ్చిన నేతలు:**

ఈ ధర్నా కార్యక్రమంలో పీసీసీ సభ్యులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, ముఖ్య నాయకులు బాలింగని జంగయ్య, కోలన్ తిరుపతి రెడ్డి, మేకల సంజీవ, నిరుడు శ్రీరాములు, టేకుల శశిధర్ రెడ్డి, క్యారగరి శ్రీధర్, పగడాల ఉమేష్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాజమాన్యం స్పందించి తక్షణమే నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.



# సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ మళ్లింపులు

**: వాహనదారులారా గమనించండి!**

సికింద్రాబాద్,, మార్చి 05 (భారత శక్తి): సికింద్రాబాద్ గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మురుగునీటి పైపులైన్ పనుల కారణంగా కీలక మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ యంత్రాంగం ప్రకటించింది. భారత్ పెట్రోల్ బంక్ నుంచి రైల్వే అండర్‌పాస్ వరకు సుమారు 419 మీటర్ల మేర 450 ఎంఎం డయా మురుగునీటి పైపులైన్ పనులను జలమండలి (HMWSSB) చేపట్టనుంది. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా కింది విధంగా మళ్లింపులు చేపట్టారు:

**మళ్లింపు మార్గాలు ఇవే..**

బేగంపేట, పంజాగుట్ట వైపు నుంచి: ఈ మార్గాల నుంచి రైల్ నిలయం రోడ్డు వైపు వెళ్లే వాహనాలకు అనుమతి లేదు. వాహనదారులు సెయింట్ జాన్స్ రోటరీ వద్ద సంగీత్ జంక్షన్ అపోలో హాస్పిటల్ లేన్ చిల్కలగూడ సర్కిల్ ఆలుగడ్డబావి మీదుగా మెట్టుగూడ వైపు వెళ్లాల్సి ఉంటుంది. AOC వైపు నుంచి: AOC నుంచి వచ్చే వాహనాలను షెనాయ్ నర్సింగ్ హోమ్ జంక్షన్ వద్ద మళ్లించనున్నారు. ఇక్కడి నుంచి అడ్డగుట్ట, లల్లాగూడ RUB, తుకారాం గేట్ మీదుగా మెట్టుగూడకు చేరుకోవచ్చు. క్లాక్ టవర్, ఎస్.డి. రోడ్ నుంచి: ఈ ప్రాంతాల నుంచి వచ్చే ట్రాఫిక్ సంగీత్ జంక్షన్ వద్ద కుడి వైపునకు తిరిగి అపోలో హాస్పిటల్ లేన్, చిల్కలగూడ సర్కిల్ మీదుగా వెళ్లాలి.

* తపస్య కాలేజీ, భారత్ పెట్రోల్ బంక్ వద్ద: సంగీత్ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను తపస్య డిగ్రీ కాలేజీ మరియు భారత్ పెట్రోల్ బంక్ వద్ద నిలిపివేస్తారు. ఇక్కడి వాహనాలు వీధి నంబర్లు 5, 6, 7 ద్వారా తుకారాం గేట్ మెయిన్ రోడ్డుకు చేరుకుని లల్లాగూడ RUB మీదుగా మెట్టుగూడ వెళ్లాలని సూచించారు.
* NCL వద్ద యుటర్న్: సంగీత్ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు NCL వద్ద యుటర్న్ తీసుకుని అపోలో హాస్పిటల్ లేన్ మీదుగా చిల్కలగూడ సర్కిల్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

ఈ పనుల దృష్ట్యా వాహనదారులు సహకరించాలని, పైన పేర్కొన్న ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు కోరారు.

# కేసుల విముక్తితో తిరుమలకు కవితమ్మ

* మొక్కు తీర్చుకునేందుకు అలిపిరి నుంచి నడక యాత్ర
* కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో పార్టీ శ్రేణుల్లో హర్షం
* రేపు ఉదయం శ్రీవారి దర్శనం



తిరుపతి, మార్చి 05 (భారత శక్తి): ఢిల్లీలోని రావుస్ అవెన్యూ కోర్టులో తనపై ఉన్న కేసులన్నీ కొట్టివేయడంతో.. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మొక్కు తీర్చుకునేందుకు తిరుమల యాత్ర చేపట్టారు. గురువారం అలిపిరి పాదాల మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆమె మెట్ల మార్గం ద్వారా నడక దారిన కొండపైకి వెళ్లారు.

**కుట్రలు వీడాయి.. న్యాయం గెలిచింది!**

కేసుల నుంచి విముక్తి లభించిన తర్వాత కవితమ్మ తొలిసారిగా తిరుమలకు రావడంతో అలిపిరి వద్ద తెలంగాణ జాగృతి నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. "కేంద్ర సంస్థలు కుట్రపూరితంగా మోపిన అక్రమ కేసులను కోర్టు కొట్టివేయడం సత్యానికి లభించిన విజయం. ఎలాంటి ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలు నిలవవని తేలిపోయింది. అగ్నిపరీక్షలో నెగ్గిన మేలిమి బంగారంలా కవితమ్మ బయటకు వచ్చారు" అని పేర్కొన్నారు.

**కొత్త పార్టీ దిశగా అడుగులు..**

వచ్చే రోజుల్లో ప్రజా సేవ కోసం కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్న కవితమ్మకు శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ఈ మొక్కుబడి యాత్ర చేపట్టినట్లు నేతలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి, మేడ్చల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు సంపత్ గౌడ్, రామిడి వెంకట్ రెడ్డి, డి.వీరన్న సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కవితమ్మ శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శించుకోనున్నారు.



# మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేత

కాప్రా, మార్చి 5 (భారత్ శక్తి): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారి వైద్య విద్యకు అయ్యే ఫీజును ఐటీ, పరిశ్రమ శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా చెక్కుల రూపంలో అందజేశారు. 8 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు చెక్కులు అందజేయడం నిజంగా అభినందనీయం అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు ,కాప్రా డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు భైరి నవీన్ గౌడ్ , చర్లపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ




కాప్రా, మార్చి 05 (భారత శక్తి): కుషాయిగూడ జెడ్ పి హెచ్ ఎస్ గవర్నమెంట్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని చర్లపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులు మరియు నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శివకుమార్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కనక రాజు గౌడ్, వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, గంప కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ వంశరాజ్, శ్రీశైలం, జై కృష్ణ, రసింహ రెడ్డి, మహేందర్, రమణ, కంకయ్య, చంచి రెడ్డి, పర్శురామ్, సాయిబాబా, కడియాల అనిల్, లోకనాథ్, యాదగిరి, శేఖర్, బాలాజీ, రాజేష్ స్థానిక బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుర్చీ మడత పెట్టి కొట్టే రోజు వస్తుంది : కేటీఆర్ హెచ్చరిక

* మూసీ నది పరివాహక ప్రాంతంలో పర్యటించిన కేటీఆర్
* కుర్చీ మడత పెట్టి కొట్టే రోజు వస్తుంది : కేటీఆర్ హెచ్చరిక
* మూసీ నది పరివాహక ప్రాంతంలో పర్యటించిన కేటీఆర్

ఎల్బీనగర్, మార్చి 05 (భారత శక్తి): పేద, మధ్య తరగతి ప్రజల ఇండ్లు కూల్చకుండా ఎలాంటి విధ్వంసం చేయకుండా మూసీ నది సుందరీకరణతో అభివృద్ధి చేసి చూపించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. గురువారం నాగోల్ లోని ఎస్టిపి (STP) ప్లాంట్ ను సందర్శించి మూసీ నది పరివాహక ప్రాంత నివాసాల బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.భారాస అధినేత కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూసీ నది తీరం వెంట ఐదున్నర కిలోమీటర్లు సుందరీకరణ చేసినట్లు తెలిపారు. నాగోల్ లో ఏర్పాటు చేసిన ఎస్టిపి ప్లాంటు 320 ఎంఎల్డితో భారతదేశంలోనే అతిపెద్ద ప్లాంట్ ను ఏర్పాటు చేసి మూసీ నది నీటిని శుద్ధి చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ప్రతిరోజు 2 వేల మిలియన్ మురికి నీరు మూసీ నదిలో ప్రవహిస్తుందని తెలిపారు. మూసీ నదిని జీవనదిగా మార్చడానికి కేసీఆర్ పునాది వేసినట్లు పేర్కొన్నారు. తాము రూ.3866 కోట్లతో 32 సివరేజి ప్లాంట్లకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 2023 డిసెంబర్ ఎన్నికల నాటికి 85% పనులు పూర్తయ్యాయని ప్రతి మురికి నీటిచుక్క గ్రావిటీ ద్వారా వచ్చి శుద్ధి చేయబడే లాగా చేశామని వివరించారు. కొండపోచమ్మ సాగర్ ద్వారా రూ.1100 కోట్లతో గోదావరి నీటిని గండిపేట చెరువులోకి తీసుకొచ్చి తద్వారా ఆ నీటిని మూసీ నదిలోకి వదిలితే ఎలాంటి సమస్య ఉత్పన్నం కాదని వివరించారు. మూసీ నదిపై 15 బ్రిడ్జిలను నిర్మించాలని అప్పట్లో నిధులు మంజూరు చేశామని, తద్వారా చెక్ డ్యాములు పెట్టి నీటిని శుద్ధిచేస్తే ఉమ్మడి నల్గొండ జిల్లాకు శుద్ధి జరిగిన నీరు వెళ్లడం ద్వారా రైతులకు న్యాయం జరిగేదని ఆ దిశగా తాము రూపకల్పన చేసినట్లు వివరించారు. మా ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా ఐదు కిలోమీటర్లు మూసీ నది సుందరీకరణ చేసి నాగోల్ లో 10 ఎకరాల విశాలమైన స్థలంలో రూ.30 కోట్లతో శిల్పారామం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాము మూసీ సుందరీకరణకు రూ.16 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తే రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చిన ప్రారంభంలో లక్షా యాభై వేల కోట్లతో సుందరీకరణ చేస్తామని అనడం ప్రజాధనాన్ని లూటీ చేయడమేనని విమర్శించారు. ఎలాంటి డిపిఆర్ రిపోర్టు లేకుండా, ప్రణాళిక లేకుండా మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న నివాసాలకు రెడ్ మార్కులు వేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ లో బుల్డోజర్ సర్కారు నడుస్తుందని మాట్లాడాడు కదా,మరి ఖమ్మంలోని వెలుగుమట్లలో పేద ప్రజల ఇండ్లు కూల్చడం ద్వారా కాంగ్రెస్ బుల్డోజర్ సర్కారు కాదా అని ప్రశ్నించారు. మహబూబ్ నగర్ లో 150 మంది వికలాంగులను, చూపు కూడా లేని వారిని మెడలు పట్టి బయట గెంటేసి ఇండ్లు కూలగొట్టడం రాహుల్ కు కనిపించలేదా అని ప్రశ్నించారు. హైడ్రా పేరిట చేసే అరాచకాలకు హైదరాబాదులో అంతే లేదని విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కట్టుకున్న ఇల్లు



రెడ్డి కుంటలో లేదా అది వాస్తవం కాదా చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన సోదరుడు తిరుపతి రెడ్డి దుర్గం చెరువులోని ఎఫ్టిఎల్ లో ఇల్లు కట్టుకున్నాడని, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకట్ స్వామి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి బఫర్ జోన్ లో ఇండ్లు కట్టుకుంటే అవి కనిపించడం లేదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి పేద ప్రజల జోలికి పోతున్నావు వారు ఊరుకోరని కుర్చీ మడతపెట్టి కొట్టే సమయం వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో రంగుల కలలు చూపించి ప్రజల ఓట్లు దండుకున్నావని వచ్చే శాసనసభ సమావేశాలలో మీరిచ్చిన 420 హామీల అమలయ్యే దాకా తమ పార్టీ పేదలకు అండగా నిలదీస్తుందని తెలిపారు. మూసీ పేరిట లూటీ చేస్తామంటే తాము ఊరుకునేది లేదని రెండున్నర సంవత్సరాలలో హైదరాబాదులో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇల్లయిన కట్టించిందా చూపించాలని ప్రశ్నించారు. కట్టించినట్లు నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. మూసీ సుందరీకరణ చేయడం నీకు చేతకాకపోతే మాకు అప్ప జెపితే చేసి చూపిస్తామని అన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రులు మహ్మద్ అలీ,శ్రీనివాస్ యాదవ్, చామకూర మల్లారెడ్డి,పి.సబితా ఇంద్రారెడ్డి,బండారి లక్ష్మారెడ్డి, వివేకా నంద, కాలేరు వెంకటేష్, ముప్పిడి గోపాల్, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు,రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్, లింగాల రాహుల్ గౌడ్, భవాని ప్రవీణ్ కుమార్, అనంతుల రాజిరెడ్డి, చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, జీవి సాగర్ రెడ్డి, పోచంపల్లి రాజేందర్ రెడ్డి, పల్లా శిల్పారెడ్డి,మల్లీశ్వరి, విజయ్ భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, భారాస నాయకులు, మూసీ పరివాహక ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సినిమా

## ఉగాదికి ఉస్తాద్ ఊచకోత



హరీశ్‌శంకర్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం ఉస్తాద్ భగత్‌సింగ్. మార్చి 26న రిలీజ్ కావాల్సిన ఈ మూవీ కాస్త ముందుగానే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేస్తున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ఉగాదికి ఉస్తాద్ ఊచకోత అంటూ మేకర్స్ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. యశ్ టాక్సిక్ మూవీ వాయిదా పడటంతో.. వరుసగా వచ్చే లాంగ్ వీకెండ్లు, దాదాపు రెండు వారాల పాటు ఉండే సెలవుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లు. ఇందులో పవన్ పోలీస్ ఆఫీసర్‌గా స్టైలిష్‌గా కనిపించనున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా.. ఇప్పటికే విడుదల చేసిన పాటలు, వీడియోలు మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి.

## మీనాక్షి దూకుడు



ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన డెహ్రాడూన్ భామ మీనాక్షి చౌదరి. ఇవాళ తన 29వ పుట్టిన రోజు జరుపుకొంటున్న ఈ అమ్మడు షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. 1997 మార్చి 5న జన్మించిన ఆమె మొదట చదువులో ప్రతిభ కనబర్చుతూ పంజాబ్‌లోని నేషనల్ డెంటల్ కాలేజీలో దంతవైద్య విద్య పూర్తి చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా ఉండి రాష్ట్రస్థాయి ఈత, బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచారు. అనంతరం అందాల పోటీల్లో పాల్గొని 2018లో మిస్ గ్రాండ్ ఇండియా కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఆ తరువాత ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ముందుగా వెబ్ సిరీస్‌లలో నటించారు. 2021లో సుశాంత్ నటించిన 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలో ప్రవేశించారు. తరువాత 'గుంటూరు కారం', 'సంక్రాంతికి వస్తున్నాం', ఇటీవల విడుదలైన 'అనగనగా ఒక రాజు' వంటి చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ' చిత్రంలో నటిస్తోంది.

## మార్చి 13న ఓటీటీలోకి

రవితేజ, డింపుల్ హయాతి, అశికా రంగనాథ్ హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయ్యింది. ఈ సినిమా ఇప్పటి వరకు ఓటీటీ స్ట్రీమింగ్ మాత్రం కాలేదు. సాధారణంగా థియేటర్‌లో విడుదలైన సినిమాలు 4 నుంచి 6 వారాల్లో ఓటిటిలోకి వస్తాయి. అయితే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' విషయంలో స్ట్రీమింగ్ కాలేదు. ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను ప్రముఖ ఓటిటి ప్లాట్‌ఫామ్ జీ 5 కొనుగోలు చేసింది. ఆ మధ్య స్ట్రీమింగ్ చేస్తున్నట్టు ప్రకటించారు కానీ అనుకోని కారణాల వలన వాయిదా వేశారు. అనేక మార్లు ఓటీటీ స్ట్రీమింగ్ వాయిదా వేసిన ఈ సినిమా మొత్తానికి ఓటీటీ రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. ఈ సినిమాను ఈ నెల 13 నుంచి స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నారు. థియేటర్ రిలీజ్‌కు సుమారు 59 రోజుల తర్వాత ఓటిటిలో స్ట్రీమింగ్‌కు రానుండటం గమనార్హం. ఈ సారైనా ఓటీటీ స్ట్రీమింగ్ కు వస్తుందో లేదా మరోసారి వాయిదా వేస్తారో మరికొద్ది రోజుల్లో తెలుస్తుంది.




## మరోసారి రియల్ హీరో అనిపించుకున్న సోనూ..

## దుబాయ్ బాధితులకు ఆపన్నహస్తం




ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ముందుకొచ్చే నటుడు సోనూ సూద్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు హఠాత్తుగా నిలిచిపోవడంతో దుబాయ్‌లో చిక్కుకుపోయిన వందలాది మంది ప్రయాణికులకు ఆయన అండగా నిలిచారు. విమానాలు రద్దు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి ఉచితంగా వసతి కల్పిస్తానని ప్రకటించి, మరోసారి రియల్ హీరో అనిపించుకున్నారు. సహాయం కావాల్సిన వారు ఎలాంటి సందేహం లేకుండా తనను సంప్రదించాలని సోనూ సూద్ కోరారు. తన ఇన్‌స్టాగ్రామ్‌కు సందేశం పంపిస్తే, తన బృందం వెంటనే స్పందించి సహాయం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సహాయానికి ఎలాంటి షరతులు వర్తించవని, ఏ దేశస్థులైనా సరే కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలబడటమే మన కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. "ఇలాంటి సంక్షోభ సమయంలో మనుషులుగా ఒకరికొకరం అండగా ఉండటం చాలా ముఖ్యం" అని సోనూ సూద్ తన సందేశంలో తెలిపారు. సోనూ సూద్ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఇది మొదటిసారి కాదు. కరోనా మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేస్తున్న సమయంలో ముఖ్యంగా లాక్‌డౌన్ విధించినప్పుడు ఆయన చేసిన సేవలు అజరామరం. పట్టణాలు, నగరాల్లో చిక్కుకుపోయిన లక్షలాది మంది వలస కార్మికులను వారి సొంత ఊళ్లకు పంపేందుకు ప్రత్యేక బస్సులు, రైళ్లు, చివరికి విమానాలు కూడా ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల్లో చిక్కుకున్న విద్యార్థులను, ఇతర భారతీయులను స్వదేశానికి రప్పించారు. ఆయన సేవలకు దేశవ్యాప్తంగా ప్రజలు నీరాజనాలు పలికారు. అప్పటి నుంచి ఆయన్ను అభిమానులు, ప్రజలు 'రియల్ హీరో'గా పిలుచుకుంటున్నారు. ఇప్పుడు మరోసారి విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వారికి సాయం చేయడానికి ముందుకు రావడంతో సోషల్ మీడియాలో ఆయనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. సంక్షోభ సమయాల్లో మానవత్వానికి అసలైన చిరునామా సోనూ సూద్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు. ఆయన ప్రకటనతో ధైర్యం పొందిన పలువురు ప్రయాణికులు ఇప్పటికే సహాయం కోసం సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. కష్టకాలంలో ఆయన అందిస్తున్న భరోసా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

## రష్మికనే ముందు ప్రపోజ్ చేసింది..

## సీక్రెట్ చెప్పిన విజయ్ దేవరకొండ

టాలీవుడ్ ప్రేమ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ రిసెప్షన్ హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. నిన్న తాజ్ కృష్ణ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్, నాగార్జున, నాగచైతన్య, రామ్ చరణ్, నాని, నవీన్ పోలిశెట్టి వంటి టాలీవుడ్ అగ్ర తారలు విచ్చేశారు. అలాగే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అర్ధాంగి గీత, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి తదితరులు హాజరై సందడి చేశారు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు ప్రేమలో ఉన్న ఈ జంట, గత నెల ఫిబ్రవరి 26న కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత విజయ్ స్వగ్రామంలో సంప్రదాయబద్ధంగా సత్యనారాయణ స్వామి వ్రతం, నూతన గృహప్రవేశ కార్యక్రమాలను కూడా పూర్తిచేశారు. వీరి ప్రేమ ప్రయాణం 'గీత గోవిందం' సినిమా సెట్స్‌లో మొదలైంది. షూటింగ్ సమయంలో ఏర్పడిన స్నేహం, కొన్నాళ్లకు ప్రేమగా మారింది. ఇటీవల ఓ ప్రెస్ మీట్‌లో విజయ్ దేవరకొండ తమ ప్రేమకథకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన రహస్యాన్ని పంచుకున్నారు. 'డియర్ కామ్రేడ్' సినిమా సమయంలో రష్మికనే తనకు ముందుగా ప్రపోజ్ చేసిందని, తాను వెంటనే అంగీకరించానని ఆయన వెల్లడించారు. ఈ విషయం వారి అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. సుదీర్ఘ కాలం పాటు రిలేషన్‌షిప్‌లో ఉన్న ఈ జంట, ఎట్టకేలకు పెళ్లి చేసుకోవడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వారం ముందే 'ఉస్తాద్ భగత్ సింగ్' రాక... కొత్త రిలీజ్ డేట్ ఇదే!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్, డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ సినిమా కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న అభిమానులకు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఒకేసారి రెండు అదిరిపోయే అప్‌డేట్స్ ఇచ్చింది. ముందుగా ప్రకటించిన తేదీ కంటే వారం ముందే ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. ముందుగా ఈ నెల 26న విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని, ఇప్పుడు వారం ముందుకు జరిపి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

"మా ఉస్తాద్ బాక్సాఫీస్ వద్ద భారీ సంబరాలు మొదలుపెట్టడానికి వారం ముందే వస్తున్నారు" అంటూ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. విడుదల తేదీ మార్పునకు ఒకరోజు ముందే ఈ చిత్ర బృందం మరో కీలక ప్రకటన చేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ (డీఎస్పీ) పనిచేస్తుండగా, ఇప్పుడు నేపథ్య సంగీతం (BGM) బాధ్యతలను స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌కు అప్పగించినట్లు తెలిపింది. దీంతో ఈ సినిమాకు ఇద్దరు అగ్ర సంగీత దర్శకులు పనిచేయనుండటం విశేషం. ఈ మార్పుపై మైత్రీ మూవీ మేకర్స్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ స్పష్టతనిచ్చింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి వచ్చిన పాటలకు అద్భుతమైన స్పందన వచ్చిందని, డీఎస్పీ అద్భుతమైన పాటలు ఇచ్చారని ప్రశంసించింది.




అయితే, నేపథ్య సంగీతం కోసం డీఎస్పీకి ఫైనల్ రీల్స్ పంపడంలో తమ వైపు నుంచి ఆలస్యం జరిగిందని నిర్మాణ సంస్థ అంగీకరించింది. దీనివల్ల ఆయన ఇతర కమిట్‌మెంట్ల కారణంగా సమయం కేటాయించలేకపోతున్నారని తెలిపింది. ఈ క్రమంలోనే డీఎస్పీతో చర్చించి, ఇద్దరి పరస్పర అంగీకారంతో నేపథ్య సంగీతం బాధ్యతలను తమన్‌కు అప్పగించినట్లు స్పష్టం చేసింది. ఇకపై ఈ చిత్రానికి పాటలను డీఎస్పీ అందిస్తుండగా, నేపథ్య సంగీతాన్ని తమన్ సమకూర్చనున్నారు. సినిమా నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకుండా ఉత్తమ ఫలితం అందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర యూనిట్ పేర్కొంది. ఇద్దరు అగ్ర సంగీత దర్శకులు ఒకే సినిమాకు పనిచేయడం అభిమానులకు పండగ లాంటి వార్త అని, థియేటర్లలో ఇది ఒక మర్చిపోలేని అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేసింది.

# మణుగూరులో కలెక్టర్ అంకిత్ సుడిగాలి పర్యటన

* ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు.
* విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట -నాణ్యమైన భోజనం అందించడం అందరి బాధ్యత
* విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదు.
* కలెక్టర్ అంకిత్..

మణుగూరు, మార్చి 05 (భారతశక్తి): భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం మణుగూరు మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి పలు ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల, గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలోని వార్డులు, ఔషధ నిల్వ గది, మందుల సరఫరా విధానం, ఔట్ పేషంట్ విభాగం, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల సేవాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో



నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, బోధన విధానం గురించి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్‌లో ఆహార తయారీ విధానాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారు పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఫలితాల వివరాలు తెలుసుకొని ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో పాటు పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, వారికి నాణ్యమైన ఆహారం అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరి యూనిట్ ద్వారా సరఫరా అవుతున్న చిక్కీలను స్వయంగా రుచి చూసి వాటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని కూడా రుచి చూసి ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి తరగతి గదులు, విద్యార్థుల హాజరు, బోధన విధానం, అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడి వారికి పాఠాలు ఎలా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మంచి విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, పోషకాహారం పంపిణీ విధానం, పిల్లల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని వంటగది, స్టోర్ రూమ్, త్రాగునీటి సదుపాయం, పరిశుభ్రత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి గుడ్ల పరిమాణాన్ని పరిశీలించారు. పిల్లలకు అందించే పోషకాహారం మెనూ ప్రకారం సమయానికి అందుతున్నదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆటపాటల ద్వారా బోధన విధానాన్ని కూడా పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం నాణ్యంగా, పరిశుభ్రంగా అందేలా, కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, వైద్యులు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఉపాధ్యాయులు విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ పాఠశాలను, అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, మార్చి 05 (భారత శక్తి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గురువారం మునగాల మండలం గూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకొని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది మరియు పదో తరగతుల గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలు అడిగారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఏడు, ఎనిమిది, తొమిది తరగతి, పదవ తరగతి విద్యార్థులతో అన్ని సబ్జెక్టులలో మాట్లాడించి వారి పఠన నైపుణ్యాలను పరీక్షించారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, పరిశీలించారు.

## భూసేకరణ, పరిహార పంపిణీ ప్రక్రియను
# పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి


* జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మార్చి 5 (భారత శక్తి): జాతీయ రహదారుల విస్తరణ, సోలార్ పార్కుల ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ, పరిహార పంపిణీ ప్రక్రియలను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్ఏ) ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మితో కలిసి నేషనల్ హైవేల విస్తరణ, నిర్మాణం కోసం భూసేకరణ చేసినప్పుడు, భూ యజమానులకు చెల్లించే పరిహారానికి (APLMA) సంబంధించి సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జేసీ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో పాటు జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి వారి సూచనల మేరకు జిల్లాలో చేపట్టిన అన్ని రకాల భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. జాతీయ రహదారులు, ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం అధికారులు భూసేకరణ చేసినప్పుడు, భూ యజమానులకు పరిహారం చెల్లించే ప్రక్రియలో భాగంగా భూసేకరణ కారణంగా భూ యజమానులు ఎదుర్కొనే నష్టాలకు పరిహారం చెల్లించడం, భూసేకరణ తర్వాత భూ యజమానులకు నిర్వహణ భత్యం చెల్లించడం, భూసేకరణ కారణంగా ప్రభావితమైన భూ యజమానులకు పరిహారం చెల్లింపునకు గల అర్హతలను రెవెన్యూ యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా చేపట్టాలన్నారు. జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. రోడ్డు విస్తరణ, నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనర్జీ ప్రాజెక్టు పనులకు సంబంధించిన ప్రతిపాధనలు, అనుమతులకు సంబంధించిన ఫైళ్లను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలన్నారు. ఇంకా ఇంకనూ పెండింగ్ లోవున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విసి కార్యక్రమంలో కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి ల్యాండ్ సర్వే శాఖ అధికారులు, సంబంది సెక్షన్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ అధికారులు సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 100%పురోగతి సాధిస్తేనే లక్ష్యాన్ని చేధించగలం

: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మార్చి 5(భారత శక్తి) : జిల్లాలోని అన్ని శాఖలలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ, ప్రజాసేవా కార్యక్రమాలలో 100% పురోగతి సాధిస్తేనే.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యాన్ని సాధించగలమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తానా ఛాంబర్ లో కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్ల పురోగతిపై అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డి. శ్రీధర్ చెరుకూరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలు, ప్రజా సేవలు మొదలైన అంశాలలోకీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్ల పురోగతిలో 100% సఫలత సాధిస్తేనే జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. అన్ని శాఖల వారికి కేటాయించిన లక్ష్యం మేరకు ఆయా ప్రమాణికాల్లో పురోగతిని బేరీజు వేసుకుని ఏ, బి, సి, డి కేటగిరీలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. కెపిఐ పురోగతిలో వెనుకబడిన శాఖల అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో అలసత్వం వహిస్తే సహించలేదన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో అన్ని శాఖల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో వైఎస్ఆర్ జిల్లా నిర్దేశిత లక్ష్యాలను 100% పూర్తి చేసేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ, రాష్ట్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల సామాజికఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా వినూత్న వ్యూహాలతో చురుకైన పాలన సాగించడం వల్ల మాత్రమే ఆకాంక్షిత జిల్లా లక్ష్య సాధనను సాధించగలమన్నాను. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ విద్యార్థులకు రూ. 60 వేల రేషన్ సరుకుల విరాళం



ఎల్బీనగర్, మార్చి 05 (భారత శక్తి): తుర్కయంజాల్ కాలనీకి చెందిన రఘుకుమార్, విజయలక్ష్మి దంపతులు గురువారం అమెరికాలో ఉంటున్న వారి కుమారుడు జగధీశ్వర సాయికృష్ణ కోడలు నిఖిత పెళ్లి రోజు సందర్భంగా ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు , గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ సమక్షంలో రూ. 60 వేల రూపాయల విలువ గల బియ్యం, పప్పులు, నూనెలు, శానిటేషన్, వస్తువులను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా రఘుకుమార్ మాట్లాడుతూ, గత ఆరు సంవత్సరాలుగా గృహ విద్యార్థుల కోరిక మేరకు మా కొడుకు, కోడలు పెళ్లి రోజున, మార్చి నెలకు అవసరమైన మొత్తం రేషన్ సరుకులను అందచేస్తున్నామని, దాతల విరాళాలను, గృహ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలకు చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేశారు.

# ముస్తాబైన బమ్మకున్ – ఉద్ – దౌలా.. 8న సీఎం చేతుల మీదుగా ప్రారంభం

* 9న కూకట్‌పల్లి 'నల్లచెరువు' ప్రారంభోత్సవం
* ఏర్పాట్లను పర్యవేక్షించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, మార్చి 05 (భారత శక్తి):నగరవాసులకు మరో చారిత్రక వినోద కేంద్రం అందుబాటులోకి రానుంది. పాతబస్తీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సుందరీకరించిన బమ్మకున్ ఉద్ దౌలా చెరువు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8వ తేదీ (ఆదివారం) సాయంత్రం 7.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ చెరువును జాతికి అంకితం చేయనున్నారు. మరుసటి రోజు, అంటే మార్చి 9న కూకట్ పల్లిలోని నల్లచెరువును కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

**ఏర్పాట్ల పరిశీలన**

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం బమ్మకున్‌ఉద్ దౌలా చెరువును సందర్శించారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఈ సుందరీకరణ విశేషాలివే:**

ఔషధ మొక్కల వనం: చెరువు కట్టపై, ఖాళీ ప్రదేశాల్లో పర్యావరణ హితంగా నాటిన వివిధ రకాల ఔషధ మొక్కలను కమిషనర్ పరిశీలించారు.



* గజబోలు (గుమ్మటాలు): సందర్శకులు సేదదీరేందుకు కట్టపై ప్రత్యేకంగా నిర్మించిన గజబోలు ఈ చెరువుకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.
* చారిత్రక ప్రాశస్త్యం: పాతబస్తీ సంప్రదాయ ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, చెరువు చరిత్రను వివరించే బోర్డులను ఆయన తనిఖీ చేశారు.
* పిల్లల కోసం: చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ప్లే ఏరియాలను కూడా అధికారులు సందర్శించారు.

**అధికారుల సమీక్ష**

చెరువు ప్రారంభం అనంతరం నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లపై పోలీసు మరియు హైడ్రా అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, అదనపు సంచాలకులు వర్ల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ పట్టణ వాసులకు మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించాలి

**: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 05 (భారత శక్తి) : నిర్మల్ పట్టణ వాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నిర్మల్ పట్టణంలోని బుధవార్ పెట్ 38 వ వార్డులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పలు వీధుల గుండా తిరుగుతూ, రోజువారీగా సాగుతున్న పారిశుద్ధ్య పనులు, త్రాగునీటి వసతి, తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయో స్వయంగా పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ, వారికి రోజు తాగునీరు అందుతుందో లేదో, పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారో లేదో వారిని అడిగి తెలుసుకున్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయేమో అని అడిగారు. ఇండ్లలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి, చెత్త వాహనాలకు అందివ్వాలని పేర్కొన్నారు. చెత్తను బయట పారివేయరాదని సూచించారు. ఎవరికైనా సమస్యలు కలిగితే వెంటనే అధికారుల, కౌన్సిలర్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అధికారులతో మాట్లాడుతూ, ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ మెరుగైన మౌళిక వసతులను కల్పించాలని తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లు దృష్టికి వస్తే వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. వేసవికాలం ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు



చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా చెత్త వాహనాలను అన్ని వీధులలోకి తీసుకురావాలని వివరించారు. ప్రతిరోజు సమయానికి త్రాగునీరు సరఫరా చేయాలని తెలిపారు. అవసరమైన చోట డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తూ, అవసరమైన వాటికి మరమ్మతులు చేయాలని చెప్పారు. డ్రైనేజీలలో తీసిన పూడికల చెత్తను ఎప్పటికప్పుడు తీసివేయాలని తెలిపారు. ఈ వార్డు పర్యటనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, తహసిల్దార్ రాజు, వార్డు కౌన్సిలర్ నాందేడపు అన్నపూర్ణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## యూరియా యాప్ తో రైతులు ఇబ్బందులు

**: పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు**

సూర్యాపేట, మార్చి 05 (భారత శక్తి):యూరియా యాప్ తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతుబంధు డబ్బులు కూడా వెంటనే ప్రభుత్వం రైతుల అకౌంట్ లో జమ చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవనంలో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇవ్వవలసిన రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. యాసంగి సాగు రైతులు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టవలసిన దుస్థితి దాపురించిందని రైతులు మళ్లీ వడ్డీ వ్యాపారం సంప్రదించవలసిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు యూరియా సరఫరా లో యూరియా యాప్ తో అనేక ఇబ్బందులు పడుతున్నారని రైతులందరికీ ఈ యాప్ మీద అవగాహన ఉండదని ఈ యూరియా సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గాలు ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులకు సకాలంలో యూరియా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ 500 రూపాయలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వెంటనే సన్న వడ్ల బోనస్ రైతు ఖాతాలో జమ చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ నాయకులు ఎడెల్లి శ్రీకాంత్, దేశగాని హేమలత, రెడ్డి మల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహించాలి

**: జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్.**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మార్చి 05 (భారత శక్తి ) మామడ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిరోజు మెరుగైన పారిశుధ్యం కొనసాగించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కింద చేపట్టిన 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా, గురువారం ఉదయం మామడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో ఆసుపత్రులు, కార్యాలయాలు, వీధులు, అన్ని ప్రాంతాలలో పరిశుభ్రతను కొనసాగించాలని చెప్పారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని వివరించారు. ఆసుపత్రి ప్రాంగణం మొత్తం శుభ్రంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటే, చికిత్సల కొరకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శెభాష్ నార్సింగి పోలీస్!

*** -ఆచూకీ లభ్యం.. బాలుడు క్షేమం**

సైబరాబాద్, మార్చి 05 (భారత శక్తి): గండిపేటలోని గండి మైసమ్మ ఆలయ పరిసరాల్లో తప్పిపోయిన బాలుడిని (3) నార్సింగి పోలీసులు అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలతో కాపాడారు. తెల్లాపూర్ గ్రామానికి చెందిన వడ్డే వెంకటేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయ సమీపంలో వెంకటేష్ ముఖం కడుక్కుంటున్న సమయంలో, పక్కనే ఉన్న ఆయన కుమారుడు అభిమన్యు అదృశ్యమయ్యాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఘటన తీవ్రతను గుర్తించిన నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణా రెడ్డి వెంటనే నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆలయ పరిసరాల్లోని ప్రతి ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించగా, సమీపంలోని పొదల్లో బాలుడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీధి కుక్కలు బాలుడిని పొదల్లోకి లాక్కెళ్లినట్లు పోలీసులు



ప్రాథమికంగా గుర్తించారు. ఈ దాడిలో బాలుడికి స్వల్ప గాయాలు కావడంతో వెంటనే కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్య సాయం అందించారు. ప్రస్తుతం బాలుడు క్షేమంగా ఉన్నాడని, సకాలంలో స్పందించి తమ కుమారుడిని ఆచూకీని గుర్తించి, ప్రాణాపాయం నుంచి తప్పించిన పోలీసు బృందాన్ని బాలుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు. భక్తులు తమ పిల్లలు, విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

### ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక, పురపాలక సంఘాలలో

## 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక వీడియో కాన్ఫరెన్స్

కామారెడ్డి జిల్లా, మార్చి 05 (భారత శక్తి) : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక 99 డే యాక్షన్ ప్లాన్ పై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎసిఎల్ బి మధుమోహన్, ఆర్డీఓ వీణ, సబ్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు, జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ), జడ్పీ సీఈఓ, డిడబ్ల్యూఓ, ఐడీఓసీ నుండి అన్ని ఎంఎస్‌వోలు, డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు ఎంసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ, సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులకు సూచించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం గుర్తించిన పది ప్రధాన అంశాలలో "అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పర్యావరణ పరిశుభ్రత , ఫైల్ క్లియరెన్స్" కార్యక్రమాన్ని మున్సిపల్ శాఖ ద్వారా ప్రత్యేకంగా చేపట్టాలని



పేర్కొన్నారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు ఈ కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో ప్రత్యేకంగా నిర్వహించనున్న నేపథ్యం లో మొదటి రోజు మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, లాంఛనంగా ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. అలాగే మున్సిపల్ స్థాయిలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రముఖులు , ప్రజల సమక్షంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రారంభ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించడం, 99 రోజుల ప్రణాళిక లక్ష్యాలు , రోజువారీ కార్యక్రమాలను వివరించడం, ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే అధికారులు, ప్రజలందరూ ఈ కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతిజ్ఞ చేయాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మార్చి 6నుండి మార్చి 15, 2026 వరకు ఏకకాలంలో పరిశుభ్రత డ్రైవ్పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం, మున్సిపల్ కమిషనర్లు ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. శిక్షణా కార్యక్రమం 99 రోజుల కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానంపై అవగాహన కల్పించేందుకు మార్చి 12, 2026న జిల్లాలో శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని, ఇందులో ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులు సర్పంచ్‌లు,చైర్‌పర్సన్‌లు, వార్డు మెంబర్లు పాల్గొనాలని, ఈ శిక్షణలో ప్రభుత్వ పథకాలు, ప్రజా పాలన - ప్రగతి ప్రాణిక కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**: పఠాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

సంగారెడ్డి , మార్చి 05 (భారత శక్తి): సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో న్యూలాండ్ పరిశ్రమ సౌజన్యంతో 57 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించడం జరిగింది, ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను విద్యార్థిని విద్యార్థుల అందించి విద్యార్థుల భవిష్యత్తుకి బంగారు బాటలు వేయడం కోసం ప్రజలందరికీ వారి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాల ల ద్వారా అత్యాధునిక పద్ధతి ద్వారా విద్యా బోధనను అందించడం కోసం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ఆధునిక వసతులతో నూతన భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు కన్న కలలను సాఫల్యం



చేయాలని, ఉపాధ్యాయుల యొక్క ఆకాంక్షలు నెరవేర్చి గొప్ప ప్రయోకులు కావాలని సందేశాన్ని ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్దన్, వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి, కమిషనర్ తిరుపతి, ప్రభుత్వ అధికారులు, కౌన్సిలర్లు, పరిశ్రమ ప్రతినిధులు,పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు దళిత బహుజన సంఘాల నాయకులు,యువజన సంఘాల నాయకులు,విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజీవ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్య శిబిరం

సూర్యాపేట జిల్లా, మార్చి 05 (భారత శక్తి): సూర్యాపేట పట్టణంలోని రాజీవ్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం నందు కంటి సమస్య లు, దంత సమస్యలు, మోకాళ్ల నొప్పులు, స్త్రీలకు సంబందించిన ఆరోగ్య సమస్యలు , జనరల్ ఆరోగ్య సమస్యల చికిత్స కోసం సూర్యాపేట జనరల్ ఆసుపత్రి కి చెందిన వైద్యులు డాక్టర్ మీలా సందీప్, డాక్టర్ రాజేష్, డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ యశ్వంత్,డాక్టర్ రేఖ, డాక్టర్ హితేష్ లు పాల్గొన్నారు.ముఖ్య అతిధిగా స్థానిక వార్డు కౌన్సిలర్ వల్దాసు లక్ష్మి శ్రీను పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి వైద్య చికిత్స పొందాలని అన్నారు.రాజీవ్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ జి వాసవి మాట్లాడుతూ డిఎంహెచ్ వొ వెంకటరమణ ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని ఈ శిబరంలో సూర్యాపేట జనరల్ హాస్పిటల్ కు చెందిన వైద్యులు



ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్,కంటి పరీక్షలు, గైనకాలజీకి సంబంధించిన వైద్యులు చిన్నపిల్లల వైద్యులు విచ్చేశారని, కావున ఆసుపత్రి పరిధిలోని ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని హెల్త్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఈ శిబిరంలో పేషంట్లను పరీక్షించి అవసరమైన రోగ నిర్ధారణ పరిక్షలతో పాటు వారికి మందులు ఉచితంగా ఇచ్చారు.విచ్చేసిన పేషంట్లకు బీపీ షుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు.అవసరమైన మందులు ఉచితంగా అ అందజేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒక్క ఇల్లు కూల్చకుండా.. రూ. 16 వేల కోట్లతోనే మూసీ సుందరీకరణ చేసి చూపిస్తాం

హైదరాబాద్ , మార్చి 05 (భారత శక్తి): మూసీ బ్యూటిఫికేషన్ పేరిట లూటీఫికేషన్ చేస్తున్నారని రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. కానీ రూ. 16 వేల కోట్లతోనే ఆ పనులు చేయొచ్చు. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాగోల్ ఎస్టీపీని పరిశీలించిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. గతంలో మూసీ తీరాన ఐదున్నర కిలోమీటర్ల పొడవునా ఒక్క ఇల్లు చెదరగొట్టకుండా రూ. ఆరు కోట్లతో సుందరీకరణ చేపట్టాం. ఫుట్‌పాత్‌లు, ఓపెన్ జిమ్‌లు, క్రీడా ప్రాంగణాలు, ల్యాండ్ స్కేపింగ్ చేశాం. భారతదేశంలోనే అతి పెద్దదైనా ఎస్టీపీని నాగోల్‌లో ఏర్పాటు చేశాం. మూసీని జీవనదిగా మార్చాలనే సంకల్పంతో 32 ఎస్టీపీలు, 15 బ్రిడ్జిలు మంజూరు చేశాం. రూ. 4 వేల కోట్లతో చేపట్టిన 32 ఎస్టీపీలు 2023 డిసెంబర్ వరకు 85 శాతం పూర్తయ్యాయి. అయితే మూసీని శుద్ధి చేసేందుకు రాజశేఖర్ రెడ్డి హయాంలో హైకోర్టు వద్ద కాఫర్ డ్యాం కట్టారని కేటీఆర్ గుర్తు చేశారు.

**గ్రావిటీ ద్వారా గండిపేటకు నీళ్లు**

ఇక మూసీని జీవనదిగా మార్చాలని చెప్పి.. గోదావరి నీళ్లను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మూసీకి తీసుకురావాలని నిర్ణయించాం. కొండపోచమ్మ సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా గండిపేటకు నీళ్లు తీసుకొచ్చి మూసీలోకి వదలాలని నిర్ణయించాం. కేవలం రూ. 1100 కోట్లతో గోదావరి నీళ్లను గండిపేట చెరువులో పోసేందుకు ప్రణాళికలకు ఆమోదం తెలిపాం. 15 బ్రిడ్జిలను రూ. 540 కోట్లతో మంజూరు చేశాం. శంకుస్థాపన చేశామని కేటీఆర్ తెలిపారు.

*** ఒక్క ఇల్లు కూలగొట్టకుండా.. రూ. 6 కోట్లతో సుందరీకరణ**

మొత్తానికి కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యి లాగా ఒక వడ్డించిన విస్తరిలాగా బంగారు పల్లెంలో పెట్టి రేవంత్ రెడ్డికి అప్పజెప్పాం. ఎస్టీపీల నిర్మాణం పూర్తి చేస్తే మూసీలోకి శుద్ధమైన నీరు వస్తది. నల్లగొండ రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో కేసీఆర్ ఈ కార్యక్రమం చేశారు. ఒక్క ఇల్లు కూలగొట్టకుండా.. నాగోల్‌లో ప్రయోగత్మకంగా ఐదు కిలోమీటర్ల మేర రూ. 6 కోట్లతో సుందరీకరణ చేశాం. ఉప్పల్ నియోజకవర్గంలో మూసీ తీరంలో పదెకరాల స్థలంలో రూ. 30 కోట్లతో శిల్పారామం ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు.

*** ఇంత అలకగా చేస్తే ఆయన రేవంత్ రెడ్డి ఎందుకు అయితడు**

ఒక్క ఇల్లు కూలగొట్టకుండా, ఒక్క ఇటుక ముట్టకుండా, ఒక్క పేదవాడి కడుపు కొట్టకుండా మూసీ సుందరీకరణ కేసీఆర్ ప్రభుత్వం చేసి చూపించింది. రేవంత్ ప్రభుత్వం చేయాల్సింది ఏంటంటే.. రూ. 1100 కోట్లతో గండిపేటకు నీళ్లు తీసుకురావాలి. 15 బ్రిడ్జిలను పూర్తి చేయాలి. బ్రహ్మాండంగా రిబ్బన్లు కట్ చేసుకోని చప్పట్లు కొట్టించుకోవచ్చు. కానీ ఆయన ఉద్దేశం వేరే ఉన్నది. ఇంత అలకగా చేస్తే ఆయన రేవంత్ రెడ్డి ఎందుకు అయితడు. రూ. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పాడు. మంచిరేవుల నుంచి ఘట్‌కేసర్ వరకు 55 కిలోమీటర్ల పొడవునా ఎక్స్‌ప్రెస్‌వే కడితే రూ. 10 వేల కోట్ల ఖర్చు అయితది. రూ. 4 వేల కోట్లతో ఎస్టీపీలు, రూ. 2 వేల కోట్లతో సుందరీకరణ చేస్తే రూ. 16 వేల కోట్లతో అయిపోతది. రూ. 16 వేల కోట్లతో పోయేదాన్ని రూ. లక్షా 50 వేల కోట్లు అని రేవంత్ రెడ్డి బహిరంగంగా చెప్పారు. డీపీఆర్ ఉందా..? అంటే లేదు.. ఒక ప్రణాళిక లేదు. మూసీ తీరాన ఉన్న ఇండ్లకు రెడ్ మార్కులు వేసి.. అధికారులు అనధికారికంగా వచ్చి బెదిరింపులకు గురి చేశారని కేటీఆర్ మండిపడ్డారు.

## ఏపీలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు శుభవార్త

అమరావతి, మార్చి 05 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా... పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్ ఉంచుకుంటే సరిపోతుంది. దానిని కండక్టర్‌కు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం కేవలం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. విద్యార్థులు తమ ఇంటి నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లడానికి, పరీక్ష పూర్తయ్యాక తిరిగి ఇంటికి రావడానికి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది సుమారు 6.42 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. బస్సుల్లో విద్యార్థులను అనుమతించే విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వారికి సహకరించాలని ఆర్టీసీ ఎండీ క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తుంది. రవాణా ఖర్చుల భారం లేకుండా, సురక్షితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఇది దోహదపడుతుంది. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్లను తమ వెంట తీసుకువెళ్లాలని అధికారులు సూచించారు.

## ఇరాన్ నౌక నుంచి ఆపద సంకేతం అందగానే వెంటనే స్పందించాం

ఢిల్లీ, మార్చి 05 (భారత శక్తి): ఇరాన్ నౌక పంపిన అత్యవసర సందేశం పట్ల వెంటనే స్పందించామని, మానవతా దృక్పథంతో సహాయక చర్యలు చేపట్టామని భారత నౌకాదళం వెల్లడించింది. ఇరాన్ నావికాదళానికి చెందిన ఫ్రిగేట్ 'ఐరిస్ డెనా' నిన్న శ్రీలంక తీరానికి సమీపంలో అమెరికా దాడికి గురై మునిగిపోవడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై భారత నౌకాదళం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆపదలో ఉన్న నావికులను రక్షించేందుకు శ్రీలంక నావికాదళంతో కలిసి సంయుక్తంగా 'సెర్చ్ అండ్ రెస్క్యూ' ఆపరేషన్లను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. మార్చి 4వ తేదీ ఉదయం శ్రీలంకలోని గాల్లే తీరానికి సుమారు 20 నాటికల్ మైళ్ల దూరంలో ఐరిస్ డెనా నౌక నుంచి డిస్ట్రెస్ కాల్ (ఆపద సంకేతం) వచ్చినట్లు శ్రీలంక మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (ఎంఆర్ సీసీ) గుర్తించింది. ఈ సమాచారం అందిన వెంటనే భారత నౌకాదళం అప్రమత్తమైంది. ఉదయం 10 గంటల సమయంలో లాంగ్ రేంజ్ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఘటనా స్థలానికి పంపించి గాలింపు చర్యలు ప్రారంభించింది. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు లైఫ్ రాఫ్ట్‌లను ఎయిర్‌డ్రాప్ చేయడానికి మరో విమానాన్ని కూడా సిద్ధం చేసింది. అంతేకాకుండా, సమీపంలోనే ఉన్న భారతీయ సెయిలింగ్ ట్రైనింగ్ షిప్ 'ఐఎన్ఎస్ తరంగిణి'ని వెంటనే ఘటనా స్థలానికి మళ్లించారు. ఇది సాయంత్రం 4 గంటలకు అక్కడికి చేరుకుని సహాయక చర్యల్లో భాగస్వామ్యమైంది. గాలింపు చర్యలను మరింత బలోపేతం చేసేందుకు కొచ్చి నుంచి సర్వే వెసెల్ 'ఐఎన్ఎస్ ఇక్షక్'ను కూడా పంపించారు. ప్రస్తుతం ఈ నౌకలు ఆ ప్రాంతంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ ఘటనలో శ్రీలంక నావికాదళం సత్వరమే స్పందించి 32 మంది గాయపడిన ఇరానియన్ నావికులను రక్షించింది. దురదృష్టవశాత్తు కొన్ని మృతదేహాలను కూడా వెలికితీశారు. నౌకలో సుమారు 130 నుంచి 180 మంది సిబ్బంది ఉన్నట్లు అంచనా వేస్తుండటంతో, మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. విశేషమేమిటంటే, ఈ ఇరాన్ నౌక ఇటీవల విశాఖపట్నంలో భారత నౌకాదళం భారీ స్థాయిలో నిర్వహించిన 'మిలాన్2026' విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళుతుండగా ఈ దాడి చోటుచేసుకుంది. అమెరికా సబ్‌మెరైన్ నుంచి వచ్చిన టార్పిడో దాడి వల్లే ఇరాన్ నౌక మునిగిపోయిందని వెల్లడైంది. ఈ ఘటనను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ జలాల్లో, భారత నేవీ అతిథిగా ఉన్న నౌకపై హెచ్చరిక లేకుండా దాడి జరగడాన్ని "సముద్రంలో అఘాయిత్యం"గా అభివర్ణించారు. అమెరికా చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## తెలంగాణలో భానుడి భగభగ...
## ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

హైదరాబాద్ : మార్చి 05 (భారత శక్తి): తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ములుగు, ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీమ్, నాగర్ కర్నూలు, నిజామాబాద్ తదితర జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే.. పూర్తి చేసి నీళ్లిచ్చేది నేనే

ఢిల్లీ, మార్చి 05 (భారత శక్తి): వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నేటితో (మార్చి 5) సరిగ్గా 30 ఏళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే" అని ఆయన స్పష్టమైన ప్రకటన చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతాంగం చిరకాల వాంఛ అయిన ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని, భవిష్యత్ కార్యాచరణను ఆయన ప్రజలతో పంచుకున్నారు. 1996 మార్చి 5వ తేదీ తనకు ఇంకా స్పష్టంగా గుర్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆనాడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతం తీవ్ర కరవు కాటకాలతో, కనీసం తాగడానికి నీళ్లు లేక అల్లాడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఆ ప్రజల కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు తొలి అడుగు వేశానని గుర్తుచేసుకున్నారు. శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్ నుంచి 43.50 టీఎంసీల నీటిని మళ్లించి... ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే బృహత్తర లక్ష్యంతో నాడు వెలిగొండకు భూమిపూజ చేశామని తెలిపారు. అయితే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి 201419 మధ్య తమ ప్రభుత్వ హయాంలో రూ.1,414 కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేశామన్నారు. కానీ, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలంటూ ప్రజలను మోసం చేసి నవ్వులపాలైందని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. గతంలో పెండింగ్ ఉన్న రూ.140 కోట్ల బిల్లులను వెంటనే క్లియర్ చేశామని, ప్రాజెక్టు నిర్మాణంపై ఇప్పటివరకు రూ.585 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. అలాగే రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. రైతుల కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, ఈ ఏడాది (2026) జులై నాటికి వెలిగొండ తొలి దశ (ఫేజ్ 1) పనులు పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. అలాగే 202728 నాటికి ఫేజ్ 2 నిర్మాణం కూడా పూర్తి చేస్తామన్నారు. కరవు ప్రాంతంలో ప్రతి ఎకరానికి నీళ్లిచ్చి, హార్టికల్చర్ సాగును ప్రోత్సహించి రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## భారత్‌కు ఎలాంటి సమయంలోనైనా చమురు సరఫరా చేయడానికి మేం సిద్ధం

పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతున్న వేళ, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళనల నడుమ రష్యా కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు నెలకొన్నప్పటికీ, భారత్‌కు ముడి చమురు సరఫరా చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నామని భారత్‌లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. హార్ముజ్ జలసంధి మూసివేత భయాలు, తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నేడు న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన అలిపోవ్.. చమురు సరఫరాదారులు ఎవరనేది నిర్ణయించుకోవాల్సింది భారత నాయకత్వమేనని, అయితే రష్యా మాత్రం భారత్‌కు ఆయిల్ ఇచ్చేందుకు ఎప్పుడూ సానుకూలంగానే ఉంటుందని భరోసా ఇచ్చారు.

## గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ

తెలంగాణ, మార్చి 05 (భారత శక్తి): తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది. 2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు, వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## తెలంగాణలో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ తో పాటు ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలు

హైదరాబాద్, మార్చి 05 (భారత శక్తి): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం 'హెల్త్ మిషన్100' (100 రోజుల ఆరోగ్య మిషన్) పేరుతో ఒక భారీ వైద్య విప్లవానికి శ్రీకారం చుట్టింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో రూపొందించిన ఈ కార్యక్రమం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రారంభం కానుంది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలు, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ, అత్యాధునిక డయాగ్నస్టిక్ సేవలను నేరుగా పేదల ముంగిటకే చేర్చడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. ఈ హెల్త్ స్క్రీనింగ్ ప్రక్రియను రాబోయే ఆరు నెలల పాటు నిరంతరాయంగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 42 లక్షల నుండి 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రాధాన్యతనిస్తున్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ నెట్‌వర్క్ ద్వారా ప్రతి మహిళకు సుమారు 30 రకాల కీలకమైన వైద్య పరీక్షలను పూర్తి ఉచితంగా నిర్వహించనున్నారు. సాధారణ రక్త పరీక్షలతో పాటు మహిళలను వేధిస్తున్న క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు ప్రత్యేకంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను కూడా ఇందులో చేర్చడం గమనార్హం. ఈ మొత్తం ప్రక్రియను నాలుగు దశల్లో విభజించి, ఆరు నెలల కాల పరిమితిలోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరీక్షలతో పాటు ప్రతి లబ్ధిదారునికి ఒక 'డిజిటల్ హెల్త్ ప్రొఫైల్'ను ప్రభుత్వం రూపొందిస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో అత్యవసర చికిత్స అవసరమైనప్పుడు వారి వైద్య చరిత్ర ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండి, సకాలంలో సరైన చికిత్స అందించేందుకు వీలవుతుంది. వీటితో పాటు రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులపై అవగాహన, పాలీ క్లినిక్‌ల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల కల్పనను కూడా ఈ 100 రోజుల మిషన్‌లో అంతర్భాగం చేశారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం, తెలంగాణ మహిళా లోకానికి ఒక బలమైన ఆరోగ్య రక్షణ కవచంలా నిలుస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ ఆశాభావం వ్యక్తం చేశారు.

## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు: ప్రధాని మోదీ

ఢిల్లీ, మార్చి 05 (భారత శక్తి): ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

**కొత్త శకంలో భారత్-యూరప్ బంధం**

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియాయూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కీలక ఒప్పందాలపై సంతకాలు**

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు.

# ప్రైవేట్ స్కూల్లో కీచక ప్రిన్సిపాల్



* వేధింపులకు నిలయంగా శ్రీ చైతన్య స్కూల్
* తోటి ఉపాధ్యాయులపై లైంగిక వేధింపులు
* వేదనకు గురవుతున్న మహిళా టీచర్లు
* కన్నుపడితే వశ పర్చుకునేందుకు కుయుక్తులు
* అనుకూలంగా ఉన్న వారిపై ప్రశంసలు
* ఎవరికి తెలియకుండా ప్రిన్సిపాల్ ను తొలగించిన నిర్వాహకులు
* బయటకు పోక్కకుండా యాజమాన్యం ప్రయత్నాలు
* నిద్రావస్థలో విద్యాశాఖ అధికారులు
* మామూళ్ల మత్తే కారణమంటున్న విద్యార్థి, మహిళ సంఘాలు

మణుగూరు, మార్చి 05 (భారతశక్తి): తల్లిదండ్రుల తర్వాత పూజించేది గురువునే, ఆ గురువు శిష్యులను కన్న బిడ్డలతో సమానంగా చూడడమేకాదు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన వ్యక్తి. అలాంటి వారిలో కొందరు కీచక ఉపాధ్యాయులు విద్యార్థినులపై, మహిళ టీచర్లపై కన్నేస్తున్నారు. వయస్సు, విచక్షణ మరిచి ఉపాధ్యాయులపై, అభం శుభం తెలియని చిన్నారులపై లైంగికంగా వేధింపులకు పాల్పడుతూ ఎంతో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి మాయని మచ్చలుగా మారుతున్నారు.




ఇలాంటి దుశ్చర్యలు మణుగూరు మండలంలో ప్రవేట్ స్కూల్ ల్లో పదుల సంఖ్యలో సంఘటనలు జరిగితే కొన్నిటికి మాత్రమే చర్యలు, మిగతావి బయటకు పొక్కకుండా స్కూల్ యాజమాన్యం ప్రయత్నాలు చేస్తున్నారు.

*** వక్రబుద్ధితో ప్రిన్సిపాల్**

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి వారిని సన్మార్గంలో వెళ్లేలా చూడాల్సిన గురువే దారి తప్పుతున్నాడు. ఉపాధ్యాయ వృత్తికి కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్నారు. కామంతో కళ్లు మూసుకుపోయి చాటింగ్ లతో నీచంగా ప్రవర్తిస్తున్నారు. పాఠశాలను ఎంతో పవిత్రంగా భావించి, సరస్వతి నిలయాలుగా కొలుస్తారు. అలాంటి నిలయాలు లైగింక, కామవాంఛ నిలయాలుగా మారుతున్నాయి. ఇదంతా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలోని శ్రీ చైతన్య స్కూల్ లో ఓ ప్రిన్సిపల్ వక్రబుద్ధితో బరితెగించాడు. లేడీ టీచర్లపై కన్ను పడి కామంతో కళ్ళు ముసుకుపోయి వారితో పర్సనల్ గా చాటింగ్ లు చేస్తూ టీచర్ల ను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అనుకూలంగా ఉంటే తప్పులు చేసిన అందలం ఎక్కించి ప్రశంసలు కురిపిస్తారు. లేకుంటే స్కూల్ యాజమాన్యం నిర్వహించే సమావేశాల్లో స్టాప్ అందరి ముందు సులకనగా మాట్లాడి పరువు తీస్తున్నారు. స్కూల్ వర్కు అధికంగా ఇచ్చి వత్తిడికి గురిచేస్తున్నారు. వశ పర్చుకునేందుకు అనేక రకాల కుయుక్తులు చేస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు.

*** వాట్సాప్ లో చాటింగ్ ఇలా.!**

నువ్వు చాలా బాగా రాస్తావు, నీకు ఏ పరీక్షనైనా పరిష్కరించడానికి అంత జ్ఞానం ఉందని నాకు తెలుసు. ఎందుకంటే నువ్వు నాకు అత్యంత ఇష్టమైన వ్యక్తివి బంగారం. నీకు నా శుభాకాంక్షలు బంగారం.. అంటూ చాటింగ్ లు చేసి టీచర్ ను మానసికంగా కుంగి పోయేలాగా చేశారు. కొంతమంది ధైర్యం తెచ్చుకొని యాజమాన్యం ఫిర్యాదులు చేస్తారు. కొంతమంది చేసేది లేక లొంగిపోతారు. కానీ ఆ టీచర్ తెగించి స్కూల్ యాజమాన్యంకు పిర్యాదు చేసింది. స్కూల్ యాజమాన్యం అతనిని మందలించి స్కూల్ నుండి బయటకు పంపించారు. ఈ ఘటన శనివారం జరినట్లు తెలుస్తోంది. ఇలాంటి విషయాలు బయటకు పొక్కతే స్కూల్ ప్రతిష్ట దెబ్బతింటుందని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

*** నిద్రావస్థలో విద్యాశాఖ**

మండలంలోని ప్రవేట్ స్కూళ్లను తనిఖీలు చేయాల్సిన అధికారులు నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరించడంపై విద్యార్థి సంఘాలు, మహిళ సంఘాలు మండిపడుతున్నాయి. విద్య వంతులు కుటుంబ పోషణ భారమై ఉపాధి కోసం ఉపాధ్యాయ వృత్తిలో చేరితే మహిళలను చులకన భావంతో మానసికంగా వేధిస్తూ కన్నీటి క్షోభకు గురిచేస్తున్నారని విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని మహిళ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మియాపూర్‌లో MDMA డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్ట్, 12.6 గ్రాముల డ్రగ్ స్వాధీనం

సైబరాబాద్, మార్చి 05 (భారతశక్తి): మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత MDMA డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామని మియాపూర్ ఇన్ స్పెక్టర్ శివప్రసాద్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు విశ్వంభర కాలనీ పార్క్ సమీపంలో ఒక వోక్స్ వ్యాగన్ కారులో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మియాపూర్ పోలీస్, మాదాపూర్ ఎస్ఓటి బృందం మధ్యాహ్నం 2.50 గంటల సమయంలో అక్కడికి చేరుకుని సదరు వాహనాన్ని తనిఖీ చేశారు. పోలీసులను గమనించి నిందితులు పారిపోయే ప్రయత్నం చేయగా, వారిని చేజ్ చేసి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, కార్ డ్యాష్ బోర్డ్‌లోని జిప్‌లాక్ కవర్‌లో తెల్లటి క్రిస్టలైన్ పదార్థం లభ్యమైందన్నారు. డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా అది 12.6 గ్రాముల MDMAగా నిర్ధారణ అయిందని తెలిపారు. నిందితులు బేరి హనుమంతు (27), భూమని మహేష్ (26), కాసం ఆదర్శ్ (28)లను అరెస్ట్ చేసి విచారించగా, వారు బెంగళూరు నుంచి ఈ డ్రగ్స్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో అధిక లాభాలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. నిందితుల నుంచి డ్రగ్స్‌తో పాటు, ఒక వోక్స్ వ్యాగన్ కారు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం




చేసుకున్నామన్నారు. ప్రస్తుతం నిందితులపై NDPS చట్టం కింద కేసు నమోదు చేసి, ఈ డ్రగ్ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ కుకట్‌పల్లి జోన్ అదనపు డీసీపీ ఎం. సుదర్శన్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించామన్నారు. డ్రగ్స్ మహమ్మారి యువత జీవితాలను నాశనం చేస్తోందన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగం గురించి మీకు ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 05 (భారత శక్తి) : వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వైద్య అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అత్యవసర పరీక్ష గది, వృద్ధాప్య వార్డు, పెడియాట్రిక్ వార్డు, ల్యాబొరేటరీ లను పరిశీలించి మాట్లాడారు. ఆసుపత్రిలోని ఎన్ని విభాగాలు ఉన్నాయని, ఎంత మంది డాక్టర్ లు ఉన్నారని, ఎంత మంది సిబ్బంది ఉన్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంతమంది ఇన్ పేషెంట్ గా అడ్మిట్ అవుతున్నారని తెలుసు కున్నారు. ఆసుపత్రిలో ఉన్న వార్డు లను కలియ తిరిగారు. ఇన్ పేషెంట్ తో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారా, మంచి ఆహారం పెడుతున్నారా అని ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. అవసరమైన ఔషధాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. గడువు ముగిసిన మందులను చెక్ చేయాలన్నారు. పేషెంట్లకు మందులు ఇచ్చే ముందు ఒకటికి రెండుసార్లు చెక్ చేయాలని సూచించారు. పేషంట్లకి అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలకు వివిధ రకాల టెస్టులను ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేయాలన్నారు. గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు హెల్త్ ప్రొఫైల్ చెక్ చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న అదనపు గదుల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్. చంద్రశేఖర్, డాక్టర్స్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ పనుల వేగం పెంచాలి

**: జిల్లా కలెక్టర్ దివాకర**

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 05 (భారత శక్తి): ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం పనులను వేగం పెంచి త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామ శివారు లోని ఎర్రి గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ భవన నిర్మాణ పనులు అత్యంత నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రిసిటీ, ఫ్లోరింగ్, పెయింటింగ్ తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని నిర్మాణ పనులలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, డి ఈ లింగ రెడ్డి, గుత్తేదారు కృష్ణ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ల అనుమతి లేని టెండర్లను రద్దు చేయాలి

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 05 (భారత శక్తి) : తోటి కౌన్సిలర్ల అనుమతి లేని టెండర్లను రద్దు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ కు వినతి పత్రాన్ని అందించిన కౌన్సిలర్లు. ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో గత నెల ఫిబ్రవరి 26న, రూ:15 కోట్లకు కౌన్సిల్ అనుమతి లేకుండా టెండర్ కు పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వెంటనే టెండర్ ను రద్దు చేయాలని, ములుగు జిల్లా కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో గురువారం జిల్లా కలెక్టర్ కు మున్సిపల్ కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ములుగు మునిసిపాలిటీ లో అభివృద్ధికి వేసే టెండర్లకు కౌన్సిలర్ల నిర్ణయాలను పరిగణలోకి తీసుకోనీ టెండర్ కు పిలుస్తూ, పాత టెండర్ ను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు సూచిన చేశారని వారన్నారు. మున్సిపాలిటీ లో రూ:60 కోట్ల నిధులు నిల్వ ఉన్నాయని, వాటికి టెండర్లు ఎవరిస్తున్నారో ఎవరు పాడుతున్నారో తెలియని అయోమయ పరిస్థితిలో ఉందన్నారు.



ములుగు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో అభివృద్ధి పనులు చేయాల్సింది ఉన్నప్పటికీ పూర్తిస్థాయి పాలకవర్గం అనుమతులు తీసుకోలేక పోవడంతో అభివృద్ధి కి ఆటంకం వాటిల్లేల మున్సిపాలిటీ పాలకవర్గం వ్యవహరిస్తుందని. వివిధ వార్డుల ప్రజలు మున్సిపాలిటీ అయిందని మురిసి పోయారు. తీర పాలకవర్గం పరిస్థితి చూస్తే ప్రజల ఆశలు నిరాశలే ఎదురయ్యేలా ఉన్నాయని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్వతంత్ర కౌన్సిలర్లు గండ్రకోట వాణి కుమార్, పోరిక రాజు, బిజెపి కౌన్సిలర్ కొత్త సురేందర్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కోయిల లక్ష్మి, బైకాని సునీత ఓదెలు, రేసోజు పద్మ వేణుగోపాలచారి, బైకాని అనూష సాగర్, గోనెల భరత్ కుమార్ లు పాల్గొన్నారు.

## పరీక్ష బాగా రాయలేదని ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

ఎల్బీనగర్, మార్చి 05 (భారత శక్తి): సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. లింగోజిగూడ మణిపూర్ కాలనీలో నివసిస్తున్న ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి గౌతమ్ శర్మ (17) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తను రాసిన గణితం 2A పరీక్ష బాగా రాయలేదని మనస్తాపానికి గురై ఈ దారుణానికి పాల్పడినట్లు సమాచారం. హోలీ పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు యాదగిరి గుట్టకు స్వామి దర్శనానికి వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. పక్కనే ఉన్న గ్లోబల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదిరెడ్డి వెల్లడించారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.